RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:23 SATURDAY,JUNE 20,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :23 శనివారం, జూన్ 20, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## మూసీ రివర్ ఫ్రంట్‌కు కేంద్రం అనుమతి

### ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి



రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి

83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం

వేగవంతం కానున్న మూసీ ఫేజ్-1 పనులు

## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం వేట..

-ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణలోకి చొరబడేందుకు మావోలు యత్నిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం

-తాలిపేరు ప్రాజెక్టు పరిసరాలను రెడ్ జోన్‌గా ప్రకటించిన ప్రత్యేక బలగాలు

-అడవుల్లోనే ఉండిపోయిన అగ్రనేతలే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్



(తెలంగాణ పత్రిక) దట్టమైన ఏజెన్సీ అడవులు మరోసారి తుపాకుల మోతకు, బూట్ల చప్పుళ్లకు రెడీ అవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి భారీ సంఖ్యలో మావోయిస్టులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2

## ఏ ఒక్క ఓటరు కార్డ్‌ను తొలగించదని కేవలం ఫేక్, డూప్లికేట్ ఐడీలనేతొలగింపు



-సర్ టార్గెట్ ఎవరో చెప్పిన

-తెలంగాణ బీజేపీఅధ్యక్షుడు రామచంద్రరావు

-రంగారెడ్డి జిల్లా నాగోల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ సమావేశం

(తెలంగాణ పత్రిక): తెలంగాణలో సర్ ఇంటెన్సివ్ రివిజన్ షురూ అయింది. అసలు ఈ సర్ టార్గెట్ ఏ ఓటర్లు అన్న అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు క్లారిటీ ఇచ్చారు. సర్ ప్రక్రియ ఏ ఒక్క ఓటరు కార్డ్‌ను తొలగించదని, కేవలం ఫేక్, డూప్లికేట్ ఐడీలనే తొలగిస్తుందని చెప్పారు. అయితే ఈసర్ ప్రక్రియపై పలు పార్టీల నేతలు పలు రకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు సైతం ఎస్ఐఆర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పార్టీ కార్యకర్తలు దగ్గరుండి ప్రతి ఓటరు గుర్తింపును రక్షించాలని అన్నారు. ఈ క్రమంలోనే రామచంద్రరావు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.కాగా ఎస్ఐఆర్ అనేది బీజేపీ తీసుకొచ్చిన ప్రోగ్రాం కాదని, ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయమని ఆయన మిగతా2లో



## ఘనంగా యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ కార్యక్రమం..

(తెలంగాణ పత్రిక)

ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించడంతో పాటు కోట్ల రూపాయల విలువైన మిగతా2లో

### ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఊహించి ఉండరు

ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఎవ్వరూ కలలోనూ ఊహించి ఉండరని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని అరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించామన్నారు. 11

## మోదీ 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారు



-సంగారెడ్డిలో రాహుల్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించిన జగ్గారెడ్డి దంపతులు

-రాహుల్ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారన్న జగ్గారెడ్డి

-దేశం కోసం మోదీ ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పగలరా అని ప్రశ్న

(తెలంగాణ పత్రిక)టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తన మార్క్ పొలిటికల్ కామెంట్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు. సంగారెడ్డి వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగ్గారెడ్డి, ఆయన భార్య ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై -2లో

## రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది



రాహుల్ జన్మదినం సందర్భంగా గాంధీ భవన్ లో కేక్ కట్ చేసిన మహేశ్ గౌడ్

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాహుల్ లక్ష్యమని వెల్లడి

కార్పొరేట్ పెత్తందారుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శ

(తెలంగాణ పత్రిక)కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భారీ కేక్ మిగతా2లో

## రాహుల్ పీఎం, రేవంత్ మరోసారి సీఎం కావడం ఖాయం



స్టేషన్ ఘన్ పూర్ లో ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ కేక్ కట్ చేసిన కడియం శ్రీహరి

మోద ప్రభుత్వానికి కూడా అదే రీతిలో బుద్ధి చెబుతారన్న శ్రీహరి

(తెలంగాణ పత్రిక) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే మిగతా2లో

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన..

### హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు

2

### నీట్ రీటెస్ట్: సైబరాబాద్ పరిధిలో 163 సెక్షన్.. కఠిన ఆంక్షలు

11

-నీట్ రీటెస్ట్ నేపథ్యంలో సైబరాబాద్‌లో కఠిన ఆంక్షలు

-ఆదివారం పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధింపు

-200 మీటర్ల పరిధిలో ఐదుగురి కంటే ఎక్కువ గుమికూడటంపై నిషేధం

### తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన... జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

-తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నాహాలు

-జూన్ 25 నుంచి ఇంటింటికి వచ్చి వివరాల సేకరణ

-సుమారు 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న అతిపెద్ద కసరత్తు

2

## మధ్యలోకి వస్తే ఖబడ్దార్.. మళ్లీ వెంటబడి ఓడిస్తాం

-సింగరేణి బాయిబాట కార్యక్రమంలో పాల్గొన్న కవిత

-కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసా కార్మికులను



2

(తెలంగాణ పత్రిక) ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది.



## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..

-ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక ఒప్పందం

-కొనసాగింపుగా స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలు

-ఒప్పందం అమలు, పర్యవేక్షణపై ఈ చర్చలు

(తెలంగాణ పత్రిక) అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. 11

# ఘనంగా యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ కార్యక్రమం..

-మొదటిపేజీ తరువాయి: రూ.10కోట్లతో రంగారెడ్డి జిల్లా కొందుర్గ్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10కోట్లతో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం ఆధునికీకరణకు కొబ్బరికాయ కొట్టారు. అలాగే రూ.4కోట్లతో నారాయణపేట్ జిల్లా నర్వలో మినీ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.4కోట్లతో వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో మల్టీ పర్పస్ స్టేడియం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టుల నిర్మాణం, క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.3.50కోట్లతో కామారెడ్డి జిల్లా గాంధారి, రూ.2.65కోట్లతో మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మినీ స్టేడియాలకు భూమిపూజ చేశారు. రూ.2.50కోట్లతో నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలం ఉట్కూరులో వాలీబాల్, కబడ్డీ కోర్టుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు సీఎం రేవంత్.

**ప్రారంభోత్సవాల వివరాలు..**

రూ.5.70 కోట్లతో బాలికల కోసం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన FIFA AIFF తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం
రూ.5.70 కోట్లతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన FIFA AIFF తెలంగాణ టాలెంట్ అకాడమీ ప్రారంభం-రూ.35.95 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం-రూ.35.94 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ అకాడమీ ప్రారంభం-రూ.44.50 లక్షలతో బాలికల కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం- రూ.44.50 లక్షలతో బాలుర కోసం గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన హాకీ అకాడమీ ప్రారంభం-రూ.58.50 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫుట్ బాల్ అకాడమీ ప్రారంభం -రూ.49 లక్షలతో బాలుర కోసం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బాల్ అకాడమీ ప్రారంభం -కాగా, ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..

-మొదటిపేజీ తరువాయి: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు వీలుగా కేంద్రం పని అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అనుమతుల ప్రకారం... ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని సుమారు రూ. 533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణ శాఖ భూమిని గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకోవడానికి కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. లీగల్, డిఫెన్స్ నిబంధనల ప్రకారం ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఈ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియకు కేంద్ర రక్షణ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీంతో బాపూఘాట్ పరిసరాల్లో ప్రతిపాదిత అంతర్జాతీయ స్థాయి స్మారక చిహ్నాలు, పర్యాటక హంగుల నిర్మాణానికి ఉన్న ప్రధాన లీగల్ అడ్డంకులు తొలగిపోయాయి. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి మా ప్రభుత్వం పెట్టుకున్న సుదూర లక్ష్యాలు సాధించడంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని కేవలం కాంక్రీట్ కట్టడాలుగా కాకుండా.. పర్యావరణ, సాంస్కృతిక, అద్భుతమైన ప్రజా ఆస్తిగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం" అని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన క్లియరెన్స్‌తో మూసీ ఫేజ్-1 పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా నవ భారత నిర్మాణం జరగాల్సి ఉంది

-మొదటిపేజీ తరువాయి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం 'గాంధీ భవన్'లో వేడుకలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ భారీ కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహేశ్ గౌడ్ మాట్లాడుతూ... దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, సమాన అవకాశాలు కల్పించడమే రాహుల్ గాంధీ ప్రధాన రాజకీయ లక్ష్యమని అన్నారు. "దేశంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల వంటి కీలక సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ. దేశవ్యాప్తంగా వివిధ ఉద్యోగ నియామక పరీక్షల్లో తరచూ జరుగుతున్న పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు దక్కాలంటే కేంద్ర ప్రభుత్వ విధానాల్లో స్పష్టమైన మార్పు రావాలి" అని చెప్పారు. రాహుల్ గాంధీ ఆకాంక్షించిన విధంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, యువత సాధికారతతో కూడిన నవ భారత నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కేవలం కొద్దిమంది కార్పొరేట్ పెత్తందారుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగుల హక్కుల రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాడుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజలకు మరింత సేవలందించేందుకు రాహుల్ గాంధీకి భగవంతుడు దీర్ఘాయుష్షును, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# మోదీ 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారు

-మొదటిపేజీ తరువాయి: సంగారెడ్డి వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగ్గారెడ్డి, ఆయన భార్య ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్, ఐఐటీ హైదరాబాద్ లాంటి జాతీయ స్థాయి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నాడు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చినవేనని జగ్గారెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ కష్టపడి నిర్మించిన ఇలాంటి ప్రభుత్వ ఆస్తులను... నేటి బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ప్రైవేటీకరణ చేస్తూ లూటీ చేస్తోందని మండిపడ్డారు. "నెహ్రూ పాలనను బ్రేక్ చేశామని బీజేపీ నేతలు సంబరాలు చేసుకుంటున్నారు. రాహుల్ గాంధీ ముత్తాత (నెహ్రూ), నానమ్మ (ఇందిరా గాంధీ), తండ్రి (రాజీవ్ గాంధీ), తల్లి (సోనియా గాంధీ) ఈ దేశం కోసం ఏం త్యాగాలు చేశారో, ఎలాంటి సంస్థలు నిర్మించారో నేను ఆధారాలతో సహా వివరిస్తా. మరి గత 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీ దేశానికి ఏం చేశారో బీజేపీ నేతలు సమాధానం చెబుతారా?" అని సూటిగా ప్రశ్నించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని... ఈ లెక్కన దేశ యువతకు ఇప్పటివరకు ఏకంగా 24 కోట్ల ఉద్యోగాలు బాకీ ఉన్నారంటూ జగ్గారెడ్డి మండిపడ్డారు. దేశం బాగుపడాలన్నా, నిరుద్యోగం అంతమవ్వాలన్నా రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేవలం ప్రెస్‌మీట్‌లకే పరిమితం కాకుండా.. రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకల జ్ఞాపకార్థం జగ్గారెడ్డి దంపతులు దాదాపు 350 మంది పాఠశాల చిన్నారులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు.

# రాహుల్ పీఎం, రేవంత్ మరోసారి సీఎం కావడం ఖాయం

-మొదటిపేజీ తరువాయి: దేశ, రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో దేశానికి రాహుల్ గాంధీ పీఎం కావడం, ఇటు తెలంగాణలో రేవంత్ రెడ్డి మరోసారి సీఎం కావడం వంద శాతం పక్కా అని కడియం శ్రీహరి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. "తెలంగాణలో మాకు ఇక ఎదురే లేదు, తిరుగే లేదు అన్నట్లు అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్పారో మనమంతా చూశాం. రానున్న రోజుల్లో కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వానికి కూడా దేశ ప్రజలు అదే రీతిలో బుద్ధి చెప్పడం ఖాయం" అని అన్నారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను రాహుల్ గాంధీ ఒంటరిగా ఎండగడుతున్నారని కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకు, అణగారిన వర్గాల బాధితులకు అండగా ఉంటూ పార్లమెంట్‌లో రాహుల్ గళం విప్పుతున్నారని ప్రశంసించారు

# ఏ ఒక్క ఓటరు కార్డ్‌ను తొలగించదని కేవలం ఫేక్, డూప్లికేట్ ఐడీలనేతొలగింపు

-మొదటిపేజీ తరువాయి:
తెలంగాణలో సర్ ఇంటెన్సివ్ రివిజన్ షురూ అయింది. అసలు ఈ సర్ టార్గెట్ ఏ ఓటర్లు అన్న అంశంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు క్లారిటీ ఇచ్చారు. సర్ ప్రక్రియ ఏ ఒక్క ఓటరు కార్డ్‌ను తొలగించదని, కేవలం ఫేక్, డూప్లికేట్ ఐడీలనే తొలగిస్తుందని చెప్పారు. అయితే ఈసర్ ప్రక్రియపై పలు పార్టీల నేతలు పలు రకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులు సైతం ఎస్ఐఆర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పార్టీ కార్యకర్తలు దగ్గరుండి ప్రతి ఓటరు గుర్తింపును రక్షించాలని అన్నారు. ఈ క్రమంలోనే రామచంద్రరావు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా ఎస్ఐఆర్ అనేది బీజేపీ తీసుకొచ్చిన ప్రోగ్రాం కాదని, ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయమని ఆయన వివరించారు. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి నాగోల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ సమావేశం నిర్వహించింది. ఇందులో కార్యకర్తలను ఉద్దేశించి రామచంద్రరావు మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత ఇలాంటి సవరణలు ఇప్పటికే 11 సార్లు జరిగాయని, చివరిసారి 2002లో నిర్వహించారని చెప్పారు. ముస్లింల ఓట్లు తొలగిస్తారంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఏ వర్గానికి చెందిన నిజమైన ఓటు కూడా తొలగించబోరని, కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లతో పాటు అక్రమ రోహింగ్యాల పేర్లను మాత్రమే తొలగిస్తారని పేర్కొన్నారు. ప్రజల మద్దతు తగ్గుతున్న విషయాన్ని కాంగ్రెస్ అంగీకరించలేక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల తొలగింపులు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపాయన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. ఓటు హక్కు భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుందని ఆయన గుర్తు చేశారు. విదేశీయులు, రోహింగ్యాలు, అక్రమంగా దేశంలోకి వచ్చిన బంగ్లాదేశీయుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండకూడదని అన్నారు. నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడం అవసరమని తెలిపారు. ఈ ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు ముఖ్యంగా బీఎల్ఏ-2 ప్రతినిధులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పని చేస్తూ అవసరమైన పత్రాల విషయంలో ఓటర్లకు సహాయం చేయాలని సూచించారు. అలాగే డూప్లికేట్, మరణించిన ఓటర్ల వివరాలను గుర్తించాలని కోరారు. ఎస్ఐఆర్ తర్వాత సిద్ధమయ్యే నవీకరించిన ఓటర్ల జాబితా ఆధారంగానే భవిష్యత్ ఎన్నికలు జరుగుతాయని రామచందర్ రావు తెలిపారు. ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కోవాలని కార్యకర్తలకు సూచించారు. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం ఎన్నికల కమిషన్ లక్ష్యమని, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడుతూ నకిలీ పేర్లను తొలగించేందుకు ఈ ప్రక్రియ కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం వేట..

-మొదటిపేజీ తరువాయి: అడవుల నుంచి భారీ సంఖ్యలో మావోయిస్టులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దుల గుండా తెలంగాణలోకి చొరబడేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ చొరబాటు యత్నాలను ప్రాథమిక దశలోనే తుత్తునియలు చేసేందుకు ఇరు రాష్ట్రాల పోలీస్ యంత్రాంగాలు రంగంలోకి దిగాయి. మావోయిస్టులు అడవి మార్గాల గుండా మైదాన ప్రాంతాల్లోకి రాకుండా ఉండేందుకు సరిహద్దులోని అత్యంత కీలకమైన 'తాలిపేరు' ప్రాజెక్టును స్పెషల్ ఫోర్సెస్ (ప్రత్యేక బలగాలు) తమ పూర్తి అధీనంలోకి తీసుకున్నాయి. ప్రాజెక్టు పరిసరాలను రెడ్ జోన్‌గా ప్రకటించి, అడవి గుండా వెళ్లే ప్రతి రహదారిని, చిన్న చిన్న కాలిబాటలను సైతం పోలీసులు పూర్తిగా బ్లాక్ చేశారు. అనుమానాస్పదంగా రాకపోకలు సాగించే ప్రతీ ఒక్కరిని జల్లెడ పడుతున్నారు. గతంలో ప్రభుత్వాలు ప్రకటించిన పునరావాస ప్యాకేజీలను తిరస్కరించి, ఇంకా అడవుల్లోనే ఉండిపోయిన అగ్రనేతలే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగుతున్నట్లు సమాచారం. గతంలో మావోయిస్టు పార్టీలో పనిచేసి, ప్రస్తుతం లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతున్న పాత సానుభూతిపరుల కదలికలను కూడా ఇంటెలిజెన్స్ నిశితంగా గమనిస్తోంది. అడవుల్లో ఉన్న యాక్షన్ టీమ్స్‌కు క్షేత్రస్థాయి నుంచి రసాయనిక సామాగ్రి, ఆహార సరుకులు లేదా అంతర్గత సమాచారం లాంటి లాజిస్టిక్ సపోర్ట్ ఏమైనా అందుతోందా అనే కోణంలో పోలీసులు అణువణువు తనిఖీలు చేస్తున్నారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో అత్యాధునిక ఆయుధాలతో రంగంలోకి దిగిన ఇరు రాష్ట్రాల ప్రత్యేక బలగాలు సంయుక్తంగా ఏజెన్సీ గ్రామాలను చుట్టుముట్టి భారీ కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి తుపాకీ గర్జన వినబడుతుందో తెలియని సందిగ్ధావస్థతో ప్రస్తుతం సరిహద్దు ఏజెన్సీ గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి.

## మధ్యలోకి వస్తే ఖబడ్దార్.. మళ్లీ వెంటబడి ఓడిస్తాం

-మొదటిపేజీ తరువాయి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహించిన సింగరేణి 'బాయిబాట' కార్యక్రమం తీవ్ర రాజకీయ వేడిని రగిల్చింది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును టార్గెట్ చేస్తూ తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కార్మికులకు, మాకు మధ్య రావాలని చూస్తే ఖబడ్దార్. గతంలో చేసిన తప్పులకే నిన్ను వెంటబడి ఓడించాం. మళ్లీ అదే పునరావృతమైతే వచ్చే ఎన్నికల్లోనూ నిన్ను వెంటాడి మరీ ఓడిస్తాం" అంటూ మంత్రి శ్రీధర్ బాబుకు ఆమె మాస్ వార్నింగ్ ఇచ్చారు. బాయిబాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టు అండర్‌గ్రౌండ్ మైన్‌లోకి దిగి కార్మికులతో ముఖాముఖి మాట్లాడారు. నల్లబొగ్గు బావుల్లో కార్మికులు పడుతున్న కష్టాలను, ప్రాణసంకట పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక కార్మికుడు తను అనుభవిస్తున్న ఇబ్బందులను వివరిస్తుండగా కవిత తీవ్ర చలనానికి లోనై మైన్ లోపలే కంటతడి పెట్టారు. కార్మికులకు తాము ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని, హక్కుల సాధన కోసం పోరాడుతామని భరోసానిచ్చారు. అనంతరం బొగ్గు గని వద్ద నిర్వహించిన భారీ గేట్ మీటింగ్‌లో కవిత మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర తెలంగాణకు ఆర్థిక వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థకు ప్రస్తుత ప్రభుత్వమే పెద్ద విద్రోహిగా మారిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి దాదాపు రూ. 50 వేల కోట్ల బకాయిలు పెట్టడం వల్లే సంస్థ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. అధికారులకు ప్రొడక్షన్ టార్గెట్లు పెంచడంపై ఉన్న శ్రద్ధ... కార్మికులకు కనీస సౌకర్యాలు, ఆధునిక పనిముట్లు కల్పించడంపై లేదని మండిపడ్డారు. "అండర్‌గ్రౌండ్ మైనింగ్‌లో మెషినరీని అప్‌గ్రేడ్ చేయడం లేదు. మ్యాన్ చైర్ మీద 45 నిమిషాల పాటు ప్రయాణించడం వల్ల కార్మికులు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నారు. సింగరేణిలో ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. జేఎంఇటీ లో ఉన్న వారికి తొమ్మిదేళ్లు గడుస్తున్నా ప్రమోషన్లు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారు" అని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు.తాను సింగరేణి కార్మికులను కలవకుండా ఉండేందుకు గత నాలుగు రోజులుగా పోలీసులు ఆంక్షలు పెడుతూ అడ్డుకుంటున్నారని కవిత ఆరోపించారు. అసలు సింగరేణి పరిధిలోకి పోలీసులకు అనుమతే లేదని, గేట్ మీటింగ్‌కు వస్తే కార్మికుల జీతాలు కట్ చేస్తామని యాజమాన్యం బెదిరించడం దుర్మార్గమన్నారు. ఒక్క కార్మికుడి జీతం కట్ చేసినా తాను ఇక్కడే గని ముందే ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. రాబోయే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ (సమీా) ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన..

-మొదటిపేజీ తరువాయి:

**కేసు వివరాలు..**

2024 డిసెంబర్ 5వ తేదీన పుష్ప-2 సినిమా ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. డిసెంబర్ 4వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోలు పడ్డాయి. ప్రీమియర్ షో చూడ్డానికి రేవతి అనే మహిళ తన కుమారుడు శ్రీతేజ్‌తో కలిసి సంధ్య థియేటర్‌కు వచ్చింది. ఈ నేపథ్యంలోనే థియేటర్ దగ్గర చోటు చేసుకున్న తొక్కిసలాటలో ఆమె సంఘటనా స్థలంలోనే మృతి చెందగా.. శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు.
ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అతడిని చర్లపల్లికి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలోనే అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మొదట నాలుగు వారాల మధ్యంతర బెయిల్, ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.

## తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన...

-మొదటిపేజీ తరువాయి: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) - 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం,

## నాణ్యత ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలి

-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 19



జగిత్యాల పట్టణంలోని పురాతన పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజన నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి పై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు భోజనం సక్రమంగా, సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. డైట్ మెను, వంటగది పరిశుభ్రత, నీటి వినియోగం, నిల్వ కిచెన్ షెడ్ విధానాలపై ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు.పాఠశాలల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తు దృష్ట్యా పోషకాహారం సమృద్ధిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను ఖచ్చితంగా అమలు చేసి, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సమాన ంగా, సమయానికి, సురక్షితమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె. రాము, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ?కొత్తగూడలో మిన్నంటిన రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

-కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జ సారయ్య ఆధ్వర్యంలో

కొత్తగూడ మండల ప్రతినిధి జూన్ 19.

(తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, జననేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు కొత్తగూడ మండల కేంద్రంలో పండుగ వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య ప్రత్యేక చొరవతో, ఆయన దిశా నిర్దేశంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఈ సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. ?కేక్ కట్ చేసి.. మిఠాయిలు పంచి.. ?మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో వజ్జ సారయ్య చేతుల మీదుగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తల నినాదాలు, జై కాంగ్రెస్ శబ్దాలతో ఆ ప్రాంత మంతా మారుమోగింది. అనంతరం నాయకులకు, ప్రజలకు, అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వజ్జ సారయ్య మాట్లాడుతూ.. దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని, దేశంలో విద్వేష రాజకీయాలను పారద్రోలి, ప్రేమను పంచడమే లక్ష్యంగా 'భారత్ జోడో యాత్ర' ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిన మహోన్నత నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. "పేదలు, రైతులు, యువత, మైనారిటీల హక్కుల కోసం పార్లమెంట్‌లోనూ, వీధుల్లో నూ నిరంతరం పోరాడుతున్న ఏకైక ధీశాలి రాహుల్ గాంధీ. దేశ భవిష్యత్తు ఆయన నాయకత్వంలోనే సురక్షితంగా ఉంటుంది. రాహుల్ గాంధీ ప్రధాని కావడమే లక్ష్యంగా కొత్తగూడ కాంగ్రెస్ శ్రేణులన్నీ కలిసికట్టు గా పనిచేస్తాయని పేర్కొన్నారు. ?ఈ వేడుకల్లో కొత్తగూడ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు అలాగే వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి, రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను విజయవంతం చేశారు.

# జూన్ 21న మల్కారంలో పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం

-మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఘన సన్మానం

తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 19



దమ్మపేట: దమ్మపేట మండలంలోని మల్కారం గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలు, పామాయిల్ రైతుల ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, పామాయిల్ సాగు అభివృద్ధికి విశేష కృషి చేసిన నాయకుడు తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తరణకు ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ రైతులు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా సన్మానించనున్నారు. అలాగే తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ రంగ ప్రవేశం చేసి 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఘన సత్కార కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పామాయిల్ రైతుల సమస్యలు, సాగు అభివృద్ధి, రైతుల సంక్షేమంపై చర్చ జరగనుంది. దమ్మపేట మండలంలోని పామాయిల్ రైతులు, ప్రజలు, తుమ్మల అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్కారం గ్రామ ప్రజలు, పామాయిల్ రైతులు కోరారు. ఇట్లు మల్కారం గ్రామ ప్రజలు & పామాయిల్ రైతులు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 19



అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాలలో డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు గజంగి నందయ్య మాట్లాడుతూ, దేశ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని పేర్కొన్నారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాల కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అనారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ప్రజల సమస్యలపై నిరంతరం గళం విప్పుతూ, సామాన్యుల పక్షాన నిలబడే నాయకత్వం ఆయనదే నని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ంలో కొత్త మోహన్, బంద శంకర్, దోమల రాజ్ కుమార్, ముఖేష్ కన్నా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

# అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభాస్యం

వేములపల్లి జూన్19 ( తెలంగాణ పత్రిక):-





వేములపల్లి మండలం ఇటిక్యాల 2 అంగన్వాడి కేంద్రం లో అమ్మ మాట అంగన్వాడి బడిబాట లో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పరిమి రజిని గారు మరియు సర్పంచ్ పెదపంగా సైదులు గారు మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రమునకు పంపించాలని పిల్లలకు ఆట, పాటల ద్వారా విద్య నేర్పుతూ ఎల్కేజీ ,యూకేజీ పాఠాలను చెబుతారని ప్రైవేట్ స్కూలుకు దీటుగా అంగన్వాడీ కేంద్రము లో మెటీరియల్ ఉందని తల్లులకు తెలియజేయడం జరిగింది. పోషకాహారం ఇస్తారని పిల్లలందరినీ అంగన్వాడి స్కూల్లో చేర్పించాలని తల్లులకు తెలియజేయడం జరిగింది. మరియు సర్పంచ్ గారి ఆధ్వర్యంలో రెండు జతల యూనిఫామ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పరిమి రజిని ,సర్పంచ్ పెదపంగా సైదులు , జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సత్యనారాయణ , ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి , స్కూల్ టీచర్ రఘాన్సీ గారు, అంగన్వాడీ టీచర్స్ సుభద్ర, యాదమ్మ, విమల, పద్మ ఆశా వర్కర్ రఘాన్సీ ఆయా జలేంద్ర ,తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# బొల్లెం చేరువు లో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం





కొడిమ్యాల,జూన్ 19, తెలంగాణ పత్రిక.

కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామం బోల్లెం చెరువు అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన సెక్టార్ సూపర్వైజర్ ఉమా తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ, అర్హత కలిగిన మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలని కేవలం అంగన్వాడికి మాత్రమే పంపించాలని అంగన్వాడీలో లభించే సేవలను వినియోగించుకోవాలని కోరారు.సిలబస్ తో కూడిన ప్రీస్కూల్ విద్యను పిల్లలకు అందిస్తున్నారు దీని ద్వారా పిల్లల మానసిక అభివృద్ధి శారీరక అభివృద్ధి మేధావికాసానికి తోడ్పడుతుంది. కాబట్టి అంగన్వాడీ కేంద్రాలకి పిల్లలని పంపించాలని సూచించి గ్రామం లో ర్యాలీ చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమానికి బొల్లెం చెరువు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మోహనా చారి, అంగన్వాడి టీచర్ కనకట్ల లత, తల్లులు పిల్లలు హాజరయ్యారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



తానూర్:19జూన్(తెలంగాణ పత్రిక)



తానూర్ మండలంలోని బోల్సా ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో సర్పంచ్ సుదర్శన్ శుక్రవారం అక్షరాభ్యాసం చేయించారు.అలాగే పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దత్తాత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, శ్రేష్ఠి, మరియు వార్డు మెంబర్లు, గ్రామస్తులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పొత్తూర్‌లో వర్షం కోసం కప్పతల్లి ఆట



ఇల్లంతకుంట జూన్ 19 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలం పొత్తూర్ గ్రామంలో వర్షాలు లేక వ్యవసాయ పనులు ఆగిపోయాయి. విత్తినలు, మొలకెత్తకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని రైతులు శుక్రవారం కప్పతల్లి ఆట ఆడారు. దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని దేవుని ప్రార్థించారు,ఈ కార్యక్రమంలో సర్పంచ్ పట్నం అశ్విని శ్రీనివాస్, ఉప సర్పంచ్ బండారి నరేష్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అనంతపల్లి గ్రామంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక



ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, దేశ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న దూరదృష్టి కలిగిన నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను అనంతపల్లి గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది. యువతకు ప్రేరణగా నిలుస్తూ, సామాన్య ప్రజల సమస్యలను అర్థం చేసుకొని వారి కోసం నిరంతరం పోరాడుతున్న మహానేత రాహుల్ గాంధీ నాయకత్వం దేశానికి ఒక దిశానిర్దేశం లాంటిదని నాయకులు పేర్కొన్నారు. సమానత్వం, న్యాయం, సామాజిక న్యాయ పరిరక్షణ వంటి విలువలను ముందుకు తీసుకెళ్తూ ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ టీం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ అల్వాల ధర్మయ్య ఉపాధి హామీ పని కూలీలతో కలిసి ఎంతో ఉత్సాహంగా, విజయవంతంగా నిర్వహించారు. గ్రామంలోని కార్మికులతో కలిసి ఈ వేడుకలు జరపడం ద్వారా రాహుల్ గాంధీ ఎల్లప్పుడూ కష్టజీవుల పక్షాన నిలబడతారనే సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ దేశ రాజకీయాల్లో ఒక నైతిక శక్తిగా నిలుస్తూ, యువతలో కొత్త ఆశలు నింపుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో దేశానికి గొప్ప నాయకుడిగా ఎదిగి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నేరెళ్ల మునిందేర్, జాగిరి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీకి జై కొట్టిన వేములవాడ చేనేత నూతన పాలకవర్గం

-మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీ చేరిన వేములవాడ చేనేత సహకార పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక

వేములవాడ పట్టణంలో ఇటీవల జరిగిన చేనేత పారిశ్రామిక సహకార సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, ఉప అధ్యక్షులు తాటికొండ రాజయ్య, కార్యదర్శి పారవెల్లి రాజేశం, కోశాధికారి రాపెల్లి దేవదాసు, కార్యవర్గ సభ్యులు మూకుమ్మడిగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు..వారికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఘనంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేనేత రంగ అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, వేములవాడ ప్రాంత ప్రగతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై విశ్వాసం వ్యక్తం చేస్తూ నూతన పాలకవర్గం కాంగ్రెస్ పార్టీకి తమ పూర్తి మద్దతు ప్రకటించింది. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, ఉపాధి అవకాశాల పెంపు, సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు

-గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టే వెంకన్న ఆధ్వర్యంలో



గూడూరు మండల ప్రతినిధి జూన్ 19.(తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, ఆదర్శవంతమైన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపిస్తున్న యువ నాయకుడు రాహుల్ గాంధీ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. శుక్రవారం రోజున గూడూరు మండలంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టే వెంకన్న ఆధ్వర్యంలో, భారీ కేక్ ను కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి, రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల టౌన్ అధ్యక్షుడు రాసమల్ల యాకయ్య, పడమటి తండా సర్పంచ్ తేజావత్ భాస్కర్, లైన్ తండా సర్పంచ్ నరేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీకటి శ్రీనివాస్, రాసమల్ల రాములు, పూజారి శంకర్ గౌడ్, గడీల రమేష్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముత్యం లక్ష్మీనారాయణ, మట్టేవాడ గ్రామ అధ్యక్షుడు వాసం వీరస్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల, గ్రామాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తానూర్ లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆకస్మిక పర్యటన







-నర్సరీ పరిశీలన:
-మందుల నిల్వలపై ఆరా:
-ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను బోధించాలి: జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.

తానూర్:జూన్ 19 :(తెలంగాణ పత్రిక)

జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం తానూర్ మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించి పలు ప్రభుత్వ సంస్థలను పరిశీలించారు. మండల కేంద్రంలోని నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించి, ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. నర్సరీలో మొక్కల పెంపకం, సంరక్షణ విధానాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల ఉత్పత్తి చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులకు సూచించారు. రికార్డులను పరిశీలించి, మందుల నిల్వలతో పాటు కుక్క, పాముకాటు, వ్యాక్సిన్ లపై ఆరా తీశారు. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులతో మాట్లాడి విద్యా బోధన, వసతి, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, వంటశాల, నిల్వ గదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించార.అలాగే పుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లలను పరిశీలించి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీధర్, ఎంఈఓ నరేందర్, ఎంపీఓ, హౌసింగ్ ఏఈ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ సేవల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఐఏఎస్

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) జూన్ 19



రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ పలు జిల్లాల కలెక్టర్లతో భూధార్ సర్వే, భూభారతి, సాదా బైనామా, నాన్-కడాస్ట్రల్ గ్రామాల రీ-సర్వే, నక్షా కార్యక్రమం తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఐఏఎస్, అదనపు కలెక్టర్ బిఎస్ లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న భూధార్ సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి భూ యజమానికి ఖచ్చితమైన భూ వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే భూభారతి కార్యక్రమం కింద వచ్చిన దరఖాస్తులను ఎటువంటి జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి అర్హులైన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాల్లో కొనసాగుతున్న నాన్ కడాస్ట్రల్ గ్రామాల రీ సర్వే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఎంపిక చేసిన గ్రామాల్లో నక్షా డిజిటల్ భూ మ్యాపింగ్ పనులను నాణ్యత ప్రమాణాలతో అమలు చేయాలని ఆదేశించారు.భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ భూ రికార్డుల ఆధునీకరణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూమి కొలతల ఎడి కిషన్ ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, మున్సిపల్ కమిషనర్,తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుంది

-దేశ నిర్మాణంలో సమగ్ర విద్య ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది.
-రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 19 తెలంగాణ పత్రిక.



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామంలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ను రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ పాఠశాల యాజమాన్యం స్థానిక ప్రజా ప్రతినిధులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమవుతుందని దేశ నిర్మాణంలో సమగ్ర విద్య ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులను విద్యావంతులుగా అత్యాధునిక సదుపాయాలను కల్పించి విశాలమైన పాఠశాల ప్రాంగణాన్ని నిర్మించి విద్యార్థుల దేహదారుఢ్యానికి విశాలమైన ఆట మైదానాన్ని కల్పించి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యని అందించనున్న పాఠశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు అన్నపూర్ణ నారాయణమూర్తి కోడూరు అనురాధ కిషోర్ కుమార్ సంధ్య ఈశ్వర్ మానస పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో విద్యా ప్రతిభతో పాటు వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలు,అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించి ప్రతి విద్యార్థిని భారత దేశం గర్వపడేలా ఒక విశ్వ నాయణకుడిగా తయారు చేస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిఎల్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కలలు కనండి కలలు కనండి గొప్ప కలలు కనండి ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోండి చిన్న లక్ష్యం పెద్ద నేరం కాబట్టి ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల యాజమాన్యంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకొని పిల్లల అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ సెక్రెటరీ మానస కోడూరు మాట్లాడుతూ ఒక విద్యార్థి ఒక ఉపాధ్యాయుడు, ఒక పుస్తకం, ఒక కలం ప్రపంచాన్ని మారుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే సుష్మ మహేందర్ రెడ్డి, గణేష్ గుప్తా , దూడల వెంకటేష్ బండి గోపాల్ హిరేఖ శివాజీ నానాజీపూర్ గ్రామ సర్పంచ్ మైలారం సురేఖ రాజు ఉపసర్పంచ్ విజయ్ కుమార్ గ్రామ ప్రతినిధులు, వివిధ గ్రామ సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అండగా టాస్క

-సీనియర్ సిటిజెన్స్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్

జగిత్యాల జూన్ 19 తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి

పిల్లల నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రులకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అండగా ఉంటున్నట్లు జగిత్యాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ వివరించారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రపంచ వయోధికుల వేధింపుల నిరోధక అవగాహన పక్షోత్సవాల సందర్భంగా వృద్ధుల సంరక్షణ చట్టం -2007,ప్రభుత్వం ఉద్యోగులతల్లి దండ్రుల పోషణ జవాబుదారీ చట్టం-2026,చట్టాలపై వివిధ యువజన సంఘాలకు హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు.తమ టాస్కా రాష్ట్ర అధ్యక్షులు పి.నర్సింహా రావు ఆధ్వర్యంలో రాష్ట్రములోని 33 జిల్లాల్లో చేస్తున్న సేవలను గుర్తు చేశారు.వృద్ధుల సంక్షేమానికి చట్టాలున్నా కొడుకులు,కోడళ్ళు, కూతుర్లు,అల్లుళ్లు,వారసుల నుంచి పలువురు ఎదుర్కొంటున్న వేధింపుల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.అనేక సందర్భాల్లో భాధితుల పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం.వినని పక్షం లోనే వృద్ధుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ అయిన ఆర్డీవో లకు ఫిర్యాదులతో కేసులు నమోదు చేయించి పరిష్కారం చూపుతున్నామన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు హన్మంత్ రెడ్డి,సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు,సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్,యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# దమ్మపేటలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు





-రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పై కేటీఆర్ అవినీతి, అక్రమాలు,

-ఇందిరమ్మ ఇళ్ల పై చేసిన ఆరోపణలను ఖండించిన దమ్మపేట కాంగ్రెస్ శ్రేణులులి

తెలంగాణ పత్రిక దమ్మపేట, జూన్ 19,

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో రాహుల్ గాంధీ కీలకమైన వ్యక్తి అని, దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబం అని, దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్ అన్నారు. శుక్రవారం దమ్మపేట మండల కేంద్రంలోని వై.ఎస్.ఆర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు తినిపించు కుంటూ కాంగ్రెస్ శ్రేణులు వేడుకలు జరిపారు. రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి, హ్యాపీ బర్త్ డే టూ రాహుల్ గాంధీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, అత్తులూరి వెంకట రామారావు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర నిర్వహించారని, ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టకుండా మన్మోహన్ సింగ్ ని ప్రధాని చేశారని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ దేశ ఐక్యత కోసం పనిచేస్తున్నారని తెలిపారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని, ఇందుకు ప్రతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై అవినీతి, అక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అంశాలను ప్రస్తావిస్తూ చేసిన విమర్శలు ఖండించిన దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ, అభివృద్ధి కనపడకపోతే మాట వస్తే చూపిస్తాం అని ఎద్దేవా చేశారు, పంచాయతీకి 10 సం.లలో 20 ఇండ్లు కట్టి, రేషన్ కార్డు ఇవ్వకుండా ప్రభుత్వం నడిపిన వ్యక్తులా మా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రధాత మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని విమర్శించేది. స్వయాన కే.టి.ఆర్ సోదరి కల్వకుంట్ల కవిత 'వీకెండ్ ఎమ్మెల్యే' అన్న మాట గుర్తులేదా కే.టి.ఆర్ కి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీకటి శ్రీనివాసరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, గోపి, అప్పారావు, పగడాల కృష్ణారావు, పసుమర్తి పెద్దబాబు, చక్రాల మల్లేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, రాంశెట్టి పుల్లారావు, వనమాల శ్రీనివాసరావు, దేవయ్య, వేముల శ్రీను, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, కుప్పాల రాంబాబు, అన్నవరపు నాగేంద్రరావు, చిలకా శ్రీనివాసరావు, ధర్మసోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరులో అశ్వారావుపేటకు అగ్రస్థానం

-ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

తెలంగాణ పత్రిక దమ్మపేట, జూన్ 19

అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి విభాగాన్ని సందర్శించారు. నియోజకవర్గంలోని అనారోగ్య బాధితుల నుంచి సేకరించిన సహాయనిధి దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రోగులపై వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు సహాయనిధి మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముఖ్యమంత్రి సహాయనిధి సద్వినియోగంలో అశ్వారావుపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వైద్య అవసరాలకు అండగా నిలుస్తోందని, నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సహాయం అందే వరకు తాను నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం నిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, చికిత్స పొందుతున్న అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన పలువురు రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్పష్టం చేశారు.

# రైతును రాజు చేస్తానన్న కాంగ్రెస్... అడుగడుగునా మోసం చేస్తుంది







-రైతును రాజు చేస్తానన్న కాంగ్రెస్... అడుగడుగునా మోసం చేస్తుంది

-రైతు బీమా ప్రీమియం కట్టని దీనస్థితిలో ప్రభుత్వం

-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆగ్రహం

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 19 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండలంలోని నెల్లూరు గ్రామంలో శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని పోచమ్మ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పాఠశాలలో నిర్మించిన ప్రహరీ గోడను మరియు గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ పిట్టలవాడలో సీసీ రోడ్డు ప్రారంభించారు.మరియు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్న సమయంలో ఎమ్మెల్యే కేంద్రాన్ని సందర్శించి భోజన ఏర్పాట్లను పరిశీలించారు. చిన్నారులకు స్వయంగా భోజనం వడ్డిస్తూ ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా కింద ఎకరాకు 12 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి ఇప్పటికీ రైతులకు పూర్తి స్థాయిలో నిధులు అందించలేదన్నారు. రైతు బీమా, సన్నవడ్లకు బోనస్, పంట కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటీవల అకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, వరి ధాన్యం తడిసి నాణ్యత కోల్పోయినా ప్రభుత్వం రైతులకు అండగా నిలవలేదని అన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు బీమా, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలు సమర్థంగా అమలయ్యాయని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియాను యాప్‌ల ద్వారా కాకుండా నేరుగా షాపుల ద్వారా అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని ఆమె విమర్శించారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, యాప్‌ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాల ద్వారా యూరియా సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన నిల్వలను అందుబాటులో ఉంచాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.వెల్దుర్తి మండలంలో ఆరు మహిళా సమాఖ్య భవనాలు మంజూరైనట్లు ఆమె తెలిపారు. వెల్దుర్తి కేంద్రంలో రెండు భవనాలు, రామాయంపల్లి, శెట్టిపల్లి, ఉప్పులింగాపూర్, దామరంచ గ్రామాల్లో ఒక్కో భవనం చొప్పున మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రతి భవనానికి రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు సునీత లక్ష్మారెడ్డి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి వెల్దుర్తి మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు సాకారం శ్రీనివాస్ గౌడ్, నెల్లూరు సర్పంచ్ రంగారెడ్డి, వెల్దుర్తి పట్టణ అధ్యక్షులు అశోక్ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పడిగే నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, శంకర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రాచమల్ల చెన్నమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి టాపర్లకు నగదు, పురస్కారాలు.



రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 19 తెలంగాణ పత్రిక.

శంషాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు తగిన ఫలితం లభించింది. సీనియర్ నాయకులు రాచమల్ల సిద్దేశ్వర్ మాతృ మూర్తి "రాచమల్ల చెన్నమ్మ మెమోరియల్ ట్రస్ట్" ఆధ్వర్యంలో శంషాబాద్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన 32 మంది విద్యార్థిని విద్యార్థులకు మెమెంటో, నగదు పురస్కారాలతో సత్కరించి అభినందించరు . ప్రతీ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని కొనసాగి ంచడానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. సందర్భ ంగా వారు మాట్లాడుతూ రాచమల్ల సిద్దేశ్వర్ తీసుకున్న నిర్ణయం విద్యార్థుల పట్ల ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. రాచమల్ల సిద్దేశ్వర్ ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

## కందుల దివ్య ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

-సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న గాంధీజీ విద్యార్థిని కందుల దివ్య

చండూరు తెలంగాణ పత్రిక జూన్ 19



చండూరు మార్చి 2026 పదవ తరగతి ఫలితాల్లో 579 మార్కులు సాధించిన గాంధీజీ స్కూల్ విద్యార్థిని కందుల దివ్య ను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు ప్రశంసా పత్రం అందించి, అభినందించారు. పేద కుటుంబంలో జన్మించిన కందుల దివ్య జి.యడవల్లి గ్రామం నుండి ప్రతిరోజు చండూరు రావడానికి ఇబ్బంది పడి, చండూరులోని షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ వారి బాలికల వసతి గృహంలో సీటును పొంది అక్కడే ఉంటూ గాంధీజీ పాఠశాలలో చదువుకుంది. ఈ సంవత్సరం మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో 579 మార్కులతో ఉత్తమ ఫలితాన్ని సాధించింది. బాలికల వసతి గృహంలో ఉంటూ నల్లగొండ జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నాడు లాల్ బహదూర్ స్టేడియం నందు ప్రశంసా పత్రం అందుకుందని గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్ రమ్యశ్రీ తెలిపారు. కందుల దివ్య ను అతని తల్లిదండ్రులను తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించి, భవిష్యత్తులో దివ్య ఉన్నత స్థానంలో ఉండాలని ఆశించారు.

## వర్షాకాల సన్నద్ధత, విపత్తు నిర్వహణపై మండల స్థాయి పారిశుధ్య సమావేశం

-కొత్తగూడ తహసిల్దార్ కొడిచింతల రాజు ఆధ్వర్యంలో



కొత్తగూడ మండల ప్రతినిధి:- జూన్ 19.(తెలంగాణ పత్రిక):-

మహబూబాబాద్ జిల్లా, వర్షాకాల సన్నద్ధత అలాగే విపత్తు నిర్వహణపై మండల స్థాయి పారిశుధ్య సమావేశం శుక్రవారం రోజున, కొత్తగూడ చింతల రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే వర్షాకాలంలో తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలను సమీక్షించారు. వాటిలో పారిశుధ్యం, మురుగునీటి పారుదల శుద్ధి, వరదల సన్నద్ధత, బలహీన నివాసాల రక్షణ, అత్యవసర ప్రతిస్పందన యంత్రాంగాలు, వ్యవసాయ సన్నద్ధత అలాగే అంతర్-శాఖల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సంబంధిత శాఖా అధికారుల కు, వర్షాకాల సంబంధిత అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అప్రమత్తం గా ఉండాలని అలాగే అవసరమైన సన్నద్ధతను నిర్ధారించుకోవాలని సూచించడం సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కొడిచింతల రాజు , ఎంపీడీఓ మిర్జా మున్వర్ బేగ్, సబ్ ఇన్ స్పెక్టర్ రాజ్ కుమార్, హెల్త్ సిహెచ్ఓ , ఇరిగేషన్ శాఖ విద్యుత్ ఏ ఈ , పంచాయతీ రాజ్ శాఖ, గ్రామ పాలన అధికారి, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



ముధోల్:19జూన్(తెలంగాణ పత్రిక)

ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ భోస్లే నారాయణరావు పటేల్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ముధోల్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు.రాహుల్ గాంధీ ఆయురారోగ్యాల తో నిండు నూరేళ్లు జీవించాలని భగవంతుని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అష్ట సర్పంచ్ రావుల శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పతంగి కిషన్, అజీజ్, నాజీమ్, పోతా రెడ్డి, పల్లె నాగేష్, యాదవ్,దిగంబర్, ప్రకాష్ తో పాటు తదితరులున్నారు.

## ఉచిత కంటి వైద్య సేవలు

### నిరంతరం కొనసాగుతాయి వంశీ



ఓదెల తెలంగాణ పత్రిక జూన్19

ఓదెల మండలం కేంద్రంలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలు ఉచిత వైద్య కంటి శిబిరాలను వినియోగించుకొని కంటి సమస్యలను తొలగించుకోవాలని కంటి వైద్య సహాయకులు లగిశెట్టి వంశీ పేర్కొన్నారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం దాదాపు పదిమందికి కరీంనగర్ చెలిమెడ ఆనందరావు ఆసుపత్రిలో ఉచిత అత్యాధునిక కంటి శాస్త్ర చికిత్స చేయడం విజయవంతమైందని పేర్కొన్నారు అదేవిధంగా ఓదెలా పెరకపల్లె దండపల్లె మరియు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఓదెల మండలంలోని ఉచిత కంటి వైద్య సేవలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు అదేవిధంగా లైన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాప అధ్యక్షుడు నేత్ర వైద్య నిపుణులు పూదరి దత్త గౌడ్.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుండి నడిపిస్తున్నాడని గ్రామంలో కంటి సమస్య లేని గ్రామాలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు ఇంకెవరికైనా సమస్యలు ఉంటే మమ్మల్ని సంప్రదించాలని కంటి శుక్లాలు పొరలు ఉన్నవారు ఓదెల దక్కన్ గ్రామీణ బ్యాంకు పక్క లక్ష్మీ ఐ కేర్ ఆప్టికల్ ను సంప్రదించవచ్చని అదేవిధంగా 7032975096 ఫోన్ ద్వారా కూడా సంప్రదించాలని వైద్య నిపుణులు వంశీ పేర్కొన్నారు

## ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ అందజేత




ముధోల్:19జూన్(తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన ముధోల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు బాసర సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ కంప్యూటర్ ను ప్రధానోపాధ్యాయులు గీత కు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇటీవల తనకు విద్య బుద్ధులు నేర్పించిన గురువు కొక్కుల గంగాధర్ పదవి విరమణ పొందారన్నారు. ఆయన కోరిక మేరకు రూ.50వేల గల కంప్యూటర్ ను అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. బాసర త్రిబుల్ ఐటీ లో ఇద్దరు విద్యార్థులు సీట్లను పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ అందజేయడం ఎంతో గర్వకారణం అని మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. అనంతరం సర్పంచ్ వెంకటేష్ గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వర్ణలత, కవిత, బాసర మాజీ ఎంపీటీసీ బాలరాజు గౌడ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతి తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరు

**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ వీరబాబు తజ్ఞతలు**

భద్రాద్రి కొత్తగూడెం: జూన్ 19 తెలంగాణ పత్రిక



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో, మాజీ కేంద్ర మంత్రివర్యులు, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ఆశీస్సులతో, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో జిల్లాలోని గ్రంథాలయాలకు సుమారు కోటి రూపాయలకు పైగా నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పట్టుదల, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దీవెనలు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో ఈ నిధులు సాధ్యమ య్యాయని పేర్కొన్నారు. అలాగే ఐటీడీఏ పీవో రాహుల్ అందించిన సహకారం ఎంతో ఉపయోగపడిందన్నారు. రేణుకా చౌదరి ఎంపీ నిధుల నుంచి సుమారు రూ.15 లక్షల నిధులు గ్రంథాలయాల అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రంథాలయాల్లో మౌలిక వసతులు మెరుగుపడి, నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల సన్నద్ధతకు మరింత ఉపయోగపడతాయని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రంథాలయాల అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు తెలిపారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఓదెల జూన్19 తెలంగాణ పత్రిక



ఓదెల మండలం కొలనూర్ లో కాంగ్రెస్ అగ్ర నాయకులు , భావి భారతానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సీట్ల పంపిణీ చేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండేటి ఐలయ్య యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యన్ని కాలరస్తున్న నియంత ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తున్న పోరాట యోధుడు, ప్రజా నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు భావి భారతదేశానికి కాబోయే ప్రధాని అని దేశ భవిష్యత్తు కోసమే నిరంతరం తపిస్తూ భారత్ జోడయాత్ర ద్వారా దేశమంతా పాదయాత్ర చేసి ప్రజలను చైతన్య పరిచి ప్రజల అనేక సమస్యలను పార్లమెంట్లో వినిపించే వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు ఆదేశాల స్థానిక నాయకులతో కలిసి స్వీట్లు పంపిణీ చేశారు... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బైరి రవి గౌడ్ , సతురి రాజేశం, సుధాకర్ రెడ్డి,కొమురయ్య, శ్రీనివాస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు...

# సిరిసిల్లలో రెండో రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షలు

**-ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేష్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక



రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు రెండో రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు కూడా కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సిరిసిల్ల మున్సిపాలిటీలో స్థానికంగా నెలకొన్న పీఏపీఎస్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ దీక్షా శిబిరం వద్దకు రావాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో కమిషనర్ ఖదీర్ పాష దీక్షా శిబిరం వద్దకు చేరుకుని కార్మికుల సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా కోశాధికారి అన్నల్దాస్ గణేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాసరపు శంకర్, పట్టణ అధ్యక్షులు ఏల్పుల బాలయ్య, సుల్తాన్ నర్సయ్య, నర్మెట బాబా కిషన్, బత్తుల దేవరాజు, బదుగు శ్రీనివాసు, గడ్డం విజయ, మారుపాక లక్ష్మీ, రెడ్డిపల్లి మమతతో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశాం

**-లక్ష్యాన్ని అధిగమించి 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**-97,807 మంది రైతుల నుంచి రూ.1,204 కోట్ల విలువైన వరిధాన్యం సేకరణ**

**-రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.1,036 కోట్లు జమ.**

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 19 (తెలంగాణ పత్రిక):



సిద్ధిపేట జిల్లాలో యాసంగి (రబీ) 2025- 2026 సీజన్ కు సంబంధించిన వరిధాన్యం కొనుగోళ్లు ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యాయని కలెక్టర్ కే. హైమవతి తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన 4.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని అధిగమించి, జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 427 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జిల్లాకు గొప్ప విజయమని పేర్కొన్నారు. జిల్లాలోని 97,807 మంది రైతుల నుంచి రూ.1,204 కోట్ల రూపాయల విలువైన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇప్పటికీ రూ.1,036 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ట్యాబ్ ఎంట్రీలు పూర్తికాగానే మిగిలిన చెల్లింపులు కూడా త్వరితగతిన పూర్తిచేస్తామని వెల్లడించారు. రైతులు ప్రభుత్వ మద్దతు ధర పథకం, ద్వారా లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు.

**సజావుగా కొనుగోళ్లు**

జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వం జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టడంతో కొనుగోళ్లు సజావుగా సాగాయని తెలిపారు. ప్రత్యేక చర్యలు చేపట్టి అదనపు హమాలీలు, రవాణా వాహనాలను ఏర్పాటు చేయడంతో పాటు మిల్లర్లతో నిరంతర సమన్వయం చేస్తూ ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం జరిగిందని, నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించిన ఫలితంగా ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి సజావుగా సాగిందని, ప్రత్యేక చర్యలు తీసుకుని ధాన్యం తడవకుండా రక్షించి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో మెరుగైన సదుపాయాలు**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, టార్పాలిన్లు, హమాలీలు, రవాణా వాహనాలు తదితర సౌకర్యాలు కల్పించడంతో పాటు అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదన్నారు.

**దాదాపు మొత్తం ధాన్యం తరలింపు పూర్తి**

కొనుగోలు చేసిన ధాన్యంలో 5,04,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులు, గోదాములకు పూర్తిగా తరలించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులతో పాటు అదనపు గోదాములను అద్దెకు తీసుకుని నిల్వ సౌకర్యాలు కల్పించడం వల్ల ఎక్కడా ధాన్యం నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

**అందరి సహకారంతో విజయవంతం**

రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తికావడంలో ప్రజాప్రతినిధులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు, రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖ, పౌర సరఫరాల సంస్థ, పౌరసరఫరాల శాఖల అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

నంగునూరు జూన్ 19(తెలంగాణ పత్రిక):



నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని నంగునూరు మండల వ్యవసాయ అధికారి గీత హెచ్చరించారు. రాజగోపాల్ పేట ఎస్సై వివేక్ తో కలిసి శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని విత్తన డీలర్ల దుకాణాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గీత, రాజగోపాలపేట ఎస్సై వివేక్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయించ వద్దని చెప్పారు. అనుమతి ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. అధిక ధరలకు అమ్మకాలు వద్దని సూచించారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా విత్తనాల కొనుగోలు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సన్న రకం విత్తనాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. దుకాణంలో ఉన్న స్టాకు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.

# ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలి

-ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి -ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి
-డీఈఓకు వినతిపత్రం అందజేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా అందించాల్సి ఉన్నప్పటికీ అమలు చేయడం లేదని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను బలవంతంగా విక్రయించడాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ డీఓకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక, ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, సంకే వంశీ, బోధసు ప్రవళిక, మామిండ్ల అనిల్, బండారి చందు, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడికి సర్పంచ్ పిల్లలు

-గట్లమల్యాల సర్పంచి ఇంగే నరేశ్ ఆదర్శ నిర్ణయం....

నంగునూరు, జూన్ 19(తెలంగాణ పత్రిక):

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామ సర్పంచి ఇంగే నరేశ్ ప్రభుత్వ పాఠశాలల పట్ల సమాజంలో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నారు. తన ఇద్దరు పిల్లలు హిమాన్స్, హిమ తేజలను గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తనకున్న విశ్వాసాన్ని చాటిచెప్పారు. ఇటీవలి కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, డిజిటల్ విద్యా సదుపాయాలు గణనీయంగా మెరుగు పడుతున్నప్పటికీ, కొందరు తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యా సంస్థల వైపే మొగ్గు చూపుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో గ్రామ సర్పంచి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం గ్రామ ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. సర్పంచి ఇంగే నరేశ్ గట్లమల్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తన కుమారుడు హిమాన్స్ ను నాలుగవ తరగతిలో, కుమార్తె హిమ తేజను ఒకటవ తరగతిలో శుక్రవారం చేర్పించారు. ఈ మేరకు ధూళిమిట్టలోని సిద్ధార్థ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన పిల్లలను గట్లమల్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్చుకోవాలని కోరుతూ ప్రధానోపాధ్యాయుడు శాడ వీరారెడ్డికి సర్పంచి ఇంగే నరేశ్ దరఖాస్తును అందజేశారు. "ప్రభుత్వ పాఠశాలలు మనవే.. వాటి అభివృద్ధి మన బాధ్యత. మార్పు ఇతరుల నుంచి ఆశించే ముందు మన నుంచే ప్రారంభం కావాలి" అనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచి ఇంగే నరేశ్ తెలిపారు. సర్పంచి తీసుకున్న ఈ నిర్ణయాన్ని గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థపై మరింత నమ్మకం పెరిగి పాఠశాలలు బలోపేతం అవుతాయని అభిప్రాయపడుతున్నారు. గట్లమల్యాల సర్పంచి చూపిన ఇంగే నరేశ్ ఈ చొరవ కేవలం తన కుటుంబానికి సంబంధించిన నిర్ణయం మాత్రమే కాదు.. ప్రభుత్వ విద్యపై సమాజంలో విశ్వాసాన్ని పెంపొందించే సామాజిక సందేశం. ఆయన అడుగు మరెందరికో స్ఫూర్తిగా నిలిచి, ప్రభుత్వ పాఠశాలల వైపు మరింత మంది తల్లిదండ్రులను ఆకర్షించే మార్గదర్శకంగా నిలవనుంది. "మాటల్లో కాదు.. చేతల్లో చూపిన నమ్మకం" అంటూ గ్రామస్థులు సర్పంచి నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ఇలాంటి ఆదర్శ చర్యలే నిజమైన బలమని విద్యా వర్గాలు పేర్కొంటున్నాయి.



# విద్యాభ్యాసానికి తొలి మెట్టు సామూహిక అక్షరాభ్యాసం

-మగ్ధుంపూర్ సర్పంచి పాకాల శ్రీనివాస్

నంగునూరు, జూన్ 19(తెలంగాణ పత్రిక):

సామూహిక అక్షరాభ్యాసం విద్యార్థుల విద్యాభ్యాసానికి తొలి మెట్టు వంటిదని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపూర్ సర్పంచి పాకాల శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేందుకు అక్షరాభ్యాసం కార్యక్రమం ఉపయోగపడుతుందని చెప్పారు. మగ్దుంపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ ఆలయ పూజారి శ్రీమంతుల లక్ష్మయ్యాచారి సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.



అనంతరం పాఠశాలలో నూతనంగా చేరిన పూర్వ ప్రాథమిక విద్యార్థులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, ముస్లీ రాజయ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కల్లూరి నర్సింలు, టి.విజయలక్ష్మి, లీల, సుమలత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

-విద్యార్థులకు పలకలు, మిఠాయిల పంపిణీ

ప్రాథమిక ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి తన మనవరాలు అద్వైత పుట్టిన రోజు శుక్రవారం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల చిన్నారులకు పలకలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

-పాఠశాలకు ఫ్యాన్ల అందజేత

మగ్దుంపూర్ గ్రామానికి చెందిన పబ్బ రాంబాబు, సాయికుమార్ లు ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్లు బహుకరించారు. తమ తండ్రి దివంగత పబ్బ అనంత రాజయ్య జ్ఞాపకార్థం ఫ్యాన్లను పాఠశాలకు ఫ్యాన్లు అందించినట్లు రాంబాబు, సాయికుమార్ తెలిపారు.

# జిల్లాలో 70 గ్రామాలలో సమగ్ర రీ-సర్వే నిర్వహణకు నోటిఫికేషన్ జారీ

-కామారెడ్డి జిల్లా కలెక్టర్

కామారెడ్డి ,జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వ ప్రధాన భూ పరిపాలన కమిషనర్ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సమగ్ర రీ-సర్వే కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా సర్వే భూ రికార్డుల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూ రికార్డుల ఆధునీకరణ, సరిహద్దుల నిర్ధారణ, రీ-సర్వే ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్రంగా చర్చించారు. జిల్లాల్లో ప్రతిపాదిత గ్రామాల రీ-సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, సర్వే లాండ్ అధికారి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో నూతనంగా ప్రతిపాదించిన 70 గ్రామాలలో సమగ్ర రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ సర్వే అండ్ బౌండరీస్ చట్టం, 1923లోని సెక్షన్ 6(1) ప్రకారం 12.06.2026 తేదీన జిల్లా గెజిట్ నెం.175 ద్వారా నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో మూడు గ్రామాల చొప్పున మొత్తం 70 గ్రామాలను ఈ సమగ్ర రీ-సర్వే కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. భూ రికార్డులను ఆధునీకరించడం, సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించడం, భూ వివాదాలను తగ్గించడం మరియు భూములకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా నమోదు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. నోటిఫికేషన్ ప్రతులను సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యాలయాలకు పంపించి, ప్రజల అవగాహన కోసం ఆయా కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రదర్శించాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతిపాదిత రీ-సర్వే గ్రామాలకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు లేదా సూచనలు ఉన్నట్లయితే, నోటిఫికేషన్ ప్రచురితమైన తేదీ నుండి నిర్దేశిత గడువులోగా సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా జిల్లా సర్వే మరియు భూ రికార్డుల కార్యాలయం, కామారెడ్డికి లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని జిల్లా పరిపాలన సూచించింది. రీ-సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని, సర్వే అధికారులు కోరినప్పుడు అవసరమైన సమాచారం, సంబంధిత పత్రాలు అందించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# పినాకిల్ అప్పర్ ప్రైమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభోత్సవం

-ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్.కె సాబేరా బేగం గౌస్



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని దుమాల రోడ్డులో నూతనంగా పినాకిల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ చైర్మన్ మహమ్మద్ క్రైస్ ఏర్పాటు చేశారు.. ఇవాళ గ్రాండ్ గా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు వరదవెల్లి స్వామి గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఒగ్గు రజిత బాలరాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రాల రాజిరెడ్డి, బండారి బాల్రెడ్డి, యమ గొండ బాల్రెడ్డి, చందనం మురళి, జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

# 1వ తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించిన పద్మ



ఓదెల. జూన్ 19 తెలంగాణ పత్రిక

ఓదెల మండలంలోని శుక్రవారం వివిధ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని. 1వ తరగతి విద్యార్థులకు అక్షర అభ్యాసం చేయించిన కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు వి పద్మ శుక్రవారం ఓదెల కాంప్లెక్స్ పాఠశాలలో అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాల ఓదెలలోని ఎంపీ ఎస్ పాఠశాల గోపరపల్లె ఎంపీ ఎస్ పాఠశాల ఓదెల అక్షర అభ్యాస కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు ఈ కార్యక్రమానికి చాలా మంది ఒకటవ తరగతి విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు ఈ సందర్భంగా వి పద్మ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో అనేక సౌకర్యాలతో విద్యను బోధించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకొని. పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు గోపరపల్లి సర్పంచ్ రవి యాదవ్ ఉపసర్పంచ్ లావణ్య తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి



నంగునూర్రు, జూన్ 19(తెలంగాణ పత్రిక):

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేసి నష్టాల నుండి బయటపడాలని మండల వ్యవసాయ అధికారి గీత రైతులకు సూచించారు. వరి సాగుపైనే ఆధారపడకుండా ఆరుతడి పంటలను పండించాలని చెప్పారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో శుక్రవారం ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎల్ నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవడమే కాక, వర్షాల రాక ఆలస్యం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కందులు, పెసర్లు, మినుములు, జొన్నలు, సజ్జలు, నువ్వులు వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయడం మంచిదని చెప్పారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ఎల్ నినో అవగాహన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పోతరాజు రేణుక రమేశ్, ఉప సర్పంచి నాగారపు అఖిల కృష్ణ, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి శిగుళ్ల బాపురాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ , రైతులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడీ బడి బాట



నంగునూరు జూన్ 19(తెలంగాణ పత్రిక):

సిద్దిపేట జిల్లాలోని మండల కేంద్రమైన నంగునూరులో అంగన్వాడీ కేంద్రం -1లో శుక్రవారం అమ్మ మాట అంగన్వాడీ బడి బాట కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడీ టీచర్ తోట పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ శిరీష, ఆయా లక్ష్మి, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నంగునూరులో
## రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నంగునూరు, జూన్ 19(తెలంగాణ పత్రిక):

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. రాహుల్ గాంధీ 56వ పుట్టిన రోజును పురస్కరించుకుని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ ఛైర్మన్ సాదుల పవన్ కుమార్, నంగునూరు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండి ఇమ్రాన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్, ఎం.డి.ఇమ్రాన్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ అలుపెరగని పోరాటం చేస్తున్నారని చెప్పారు. దేశంలో అణగారిన వర్గాలపై దాడులను నిరసిస్తూ, బాధితులకు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా పార్లమెంట్ లో గళం విప్పుతున్నారని తెలిపారు. రానున్న లోక్ సభ ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని చెప్పారు. ఆ దిశగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికునిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు గొట్టం రంగారెడ్డి, బానోతు జీవన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పదిరే శ్యామ్ రెడ్డి, కరెడ్ల వెంకట్ రెడ్డి, గడ్డం కరుణాకర్ రెడ్డి, బోజు రాములు, శివ, రాజు, అభినవ్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మంచినీటి శుద్ధి యంత్రం అందజేత

-చిన్నారుల దాహార్తి తీర్చేందుకు సర్పంచి చొరవ



నంగునూరు, జూన్ 19(తెలంగాణ పత్రిక):

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంచినీటి శుద్ధి యంత్రాన్ని గ్రామ సర్పంచి రేకులపల్లి సంతోష్ రెడ్డి తన స్వంత ఖర్చులతో అందించారు. ఈ మేరకు పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభించారు. మంచి నీటి కోసం పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వెంకటాపూర్ గ్రామ సర్పంచి రేకులపల్లి సంతోష్ రెడ్డి తన సొంత ఖర్చుతో రూ. 20,000 విలువైన మంచినీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేకులపల్లి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యకరమైన నీరు తాగాలనే ఉద్దేశంతో యంత్రాన్ని అందించినట్లు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింగాబట్టు రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక చొరవతో మంచినీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ ఇదే స్ఫూర్తితో మన ఊరు - మన బడిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాగుల రమేశ్, శ్వేత, బాలమల్లు ఏపీసీ చైర్మన్ ధనలక్ష్మి, వార్డు సభ్యులు రంగు రాజు, దుంబాల సాయి కిరణ్, లింగంపల్లి శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# బొద్దుగుండ రైతు వేదిక లో అవగాహన కార్యక్రమం

-గూడూరు మండల వ్యవసాయ క్షేత్రాధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో

గూడూరు మండల ప్రతినిధి:- జూన్ 19.
(తెలంగాణ పత్రిక):-



మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని బొద్దుగొండ రైతువేదికలో, గూడూరు మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ అబ్దుల్ మాలిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో, ఆయన మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో సాధారణంగా వర్షపాతం తగ్గిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం జరుగుతాయని, అలాంటి పరిస్థితుల్లో తక్కువ నీటితో పెరిగే అలాగే పొడిబారిన పరిస్థితులను తట్టుకునే పంటలు వేయడం మంచిదని సూచించారు. ఆరు తడి (ఖరీఫ్/వానాకాలం) కోసం అనుకూలమైన పంటలు: జొన్న, సజ్జ, రాగి, పెసలు, మినుములు, కంది, శెనగ (కొన్ని ప్రాంతాల్లో) వేరుశెనగ, సోయాబీన్, (మధ్యస్థ వర్షపాతం ఉన్నచోట) పత్తి, (నీటి లభ్యత కొంత ఉంటే) వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను తగ్గించడం మంచిదని, ముఖ్యంగా నీటి నిల్వలు తక్కువగా ఉంటే, ఉపయోగకరమైన సూచనలు: తక్కువ కాలంలో పండే రకాలు ఎంచుకోండని, డ్రిప్ లేదా స్ప్రింక్లర్ సాగు ఉపయోగించండని, వర్షపు నీరు నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేయండని, విత్తనాలను ఆలస్య వర్షాలకు అనుగుణంగా సిద్ధం పెట్టుకోండని, గూడూరు మండల వ్యవసాయ అధికారి మొత్తం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండ కృష్ణ , ఉప సర్పంచ్, ఏఈఓ మనోజ్ , రైతులు పాల్గొన్నారు.

# "సర్" ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలి

-పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టాలి:
వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రభుత్వ తరపున బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు), రాజకీయ పార్టీల తరపున బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) సమన్వయంతో పనిచేయాలని కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు మాత్రమే ఎన్నికల జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లను తొలగించే లక్ష్యంతో సర్ ప్రక్రియ చేపడుతున్నామని ఆర్డీఓ వివరించారు. సర్ అనగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి సవరణలు చేపట్టే ప్రక్రియ అని తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలోని 262 పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయిలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు చురుకుగా పనిచేసి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ఓటర్ల ఓట్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని, అనర్హుల పేర్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పొలాస నరేందర్, మైలారం రాము, పిన్నింటి హన్మాండ్లు, చింతలకోటి రామస్వామి గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ అబ్దుల్ రహీం, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్ డిగ్రీ కళాశాలలో AI & డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణా కార్యక్రమం ప్రారంభం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 19, తెలంగాణ పత్రిక



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆమనగల్‌లో అన్న అక్క మెంటార్‌షిప్ టీచింగ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ఆన్ ా× ఁ డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ మరియు కోడ్ మిత్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం 2026 జూన్ 18న ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శార్వాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), డిజిటల్ లెర్నింగ్, కంప్యూటేషనల్ థింకింగ్ వంటి ఆధునిక అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రొఫెసర్ . శార్వాణి మార్గదర్శకత్వంలో మెంటార్లు గోపాల్, హరీష్, అధ్యాపకులు చంద్రశేఖర్, శ్రీనివాస్, రాజు, శ్రీవాణిల సహకారంతో కార్యక్రమం కొనసాగుతోంది. నోడల్ అధికారులు జగదీశ్వర్ రెడ్డి, గోపాల్ సమన్వయంతో మాస్టర్ ట్రైనర్ దివాకర్ తివారీ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రారంభ సెషన్లలో విద్యార్థులు ా×, డిజిటల్ లెర్నింగ్, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై ఉత్సాహంగా పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ శిక్షణా కార్యక్రమం 2026 జూన్ 19న ముగియనుంది.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులు

-సీఐ వెంకటేశ్వర్లు.



తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి , జూన్ 19.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో కరకగూడెం మండలంలోని ఫెర్టిలైజర్, విత్తనాల దుకాణాల్లో శుక్రవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ నాగేశ్వరావు లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరకగూడెం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, బిల్ బుక్స్, గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు అమ్ముతున్న పత్తి, మిర్చి, వరి విత్తనాల బ్యాచ్ నంబర్లు, ఎక్స్‌పైరీ తేదీలు సరిచూశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "రైతుల జీవితాలతో చెలగాటమాడే నకిలీ విత్తనాల దందాను ఉపేక్షించేది లేదు. లైసెన్స్ లేకుండా, బిల్లులు ఇవ్వకుండా నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు అమ్మినట్లు తేలితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే బిల్లుతో సహా విత్తనాలు కొనాలని సూచించారు. నకిలీ విత్తనాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ తెలియజేయాలని కోరారు. అలాగే షాపు యజమానులు రేట్ల పట్టికను అందరికీ కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక ఆకస్మిక తనిఖీలు

- కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, బ్యూటీ పార్లర్లలో విస్తృత పరిశీలన



మేడ్చల్, (తెలంగాణ పత్రిక) జూన్ 19 :



ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధా న్యత ఇస్తూ మేడ్చల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక శుక్రవారం మేడ్చల్ పరిధిలోని ఐదు వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కిరాణా షాపులు, ఫ్యాన్సీ స్టోర్లు, బ్యూటీ పార్లర్లలో విక్రయిస్తున్న ఉత్పత్తుల నాణ్యత, గడువు తేదీలు, లేబులింగ్ మరియు నిబంధనల అమలును పరిశీలించారు. తనిఖీల సందర్భంగా కిరాణా దుకాణాల్లో విక్రయిస్తున్న సబ్బులు, పౌడర్లు, లోషన్లు పరిశీలించగా, ఫ్యాన్సీ స్టోర్లలో ఫేస్ పౌడర్లు, క్రీములు, లిప్ బామ్స్ తనిఖీ చేశారు. అలాగే బ్యూటీ పార్లర్లలో వినియోగిస్తున్న ఫేస్ క్రీములు, బ్యూటీ పౌడర్లు మరియు సౌందర్య ఉత్పత్తులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. వ్యాపారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన ఉత్పత్తులనే విక్రయించాలని, గడువు ముగిసిన వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఉత్పత్తుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రజారోగ్య సంరక్షణలో మౌనిక ప్రత్యేక చొరవ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మౌనిక ప్రజారోగ్య రక్షణ కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ అవగాహన కల్పించడం ప్రశంసనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిబంధనల అమలులో రాజీపడకుండా ప్రజల భద్రతే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆమె సేవలను పలువురు కొనియాడుతున్నారు.

## అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



చందుర్తి , జూన్ 19 , తెలంగాణ పత్రిక.

చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో అంగన్వాడీ రెండవ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు, అమ్మ మాట అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో నూతనంగా నమోదైన చిన్నారులకు గ్రామ సర్పంచ్ కటకం మల్లేశం అక్షరాభ్యాసం చేయించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు, అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, జన్మదిన వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు, అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగం చేసుకొని కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు, ఈ సందర్భంగా ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు లింగంపల్లి బాబు అంగన్వాడి ఉపాధ్యాయులు బుర్ర రేణుక,న్యాత పద్మ, గసికంటి రేణుక పిల్లల తల్లులు, ఆరోగ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ దయతో పల్లెలు పచ్చగా ఉండాలి

-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



పాపన్నపేట, జూన్ 19:(తెలంగాణ పత్రిక)

పెద్దమ్మతల్లి కరుణాకటాక్షాలతో సమృద్ధిగా వర్షాలు కురిసి పల్లెలు పచ్చగా కళకళలాడాలని, రాష్ట్రం సిరిసంపదలు, సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు ఆకాంక్షించారు. శుక్రవారం మండల పరిధిలోని కోడుపాక గ్రామంలోని పెద్దమ్మతల్లి ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే రోహిత్ రావు, రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని, రైతన్నలు పంటలతో కళకళలాడుతూ ఆనందంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. కోడుపాక గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నరేందర్గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్రెడ్డి,మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, భూమయ్య, సతీష్,అప్సర్, మహేష్ గుప్తా, నాయకులు ఖలీం, సంగమేష్, శివయ్య, రాములు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## కొత్త ఊపులో గులాబీదళం

-ఉమ్మడి జిల్లాలో పోరుబాట

కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

గులాబీ శ్రేణులు తాజాగా రైతు కష్టాలను భుజానికెత్తుకున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొంతకాలంగా సైలెంట్గా ఉంటున్న బీఆర్ఎస్మళ్లీ కదం తొక్కుతోంది. యూరియా కొరతతో అల్లాడుతున్న అన్నదాతలకు తోడుగా నిలిచి, ప్రభుత్వ వైఫల్యాలపై సమరానికి సిద్ధమైంది. రైతులకు అండగా బీఆర్ఎస్ క్యాడర్ రోడ్లపైకి వస్తోంది. యూరియా యాప్పై సమర శంఖం పూరిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బాల్కొండ, బాన్సువాడ మినహా ఎక్కడా బీఆర్ఎస్ జెండా ఎగరలేదు. కామారెడ్డిలో స్వయంగా కేసీఆర్ పోటీ చేసినా ఫలితం దక్కలేదు. అయితే బాన్సువాడలో గెలిచిన పోచారం తర్వాత కాంగ్రెస్లో చేరారు. అప్పటి నుంచి క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు నామమాత్రమయ్యాయనే విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం మళ్లీ యాక్టివ్ కావడంతో బీఆర్ఎస్లో కొత్త జోష్ కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న యూరియా సంక్షోభం బీఆర్ఎస్కు అవకాశంగా మారింది. 'యూరియా యాప్' పేరుతో రైతులను ఆన్లైన్ చుట్టూ తిప్పుతున్నారని, గత ప్రభుత్వ హయాంలో ఇంటికే ఎరువులు వచ్చేవని గుర్తుచేస్తూ నేతలు జనంలోకి వెళ్తున్నారు. రైతులతో కలిసి రోడ్లపై నిరసనలకు ప్లాన్ చేస్తున్నారు. రైతులకు తామున్నామనే భరోసా కల్పించే ప్రయత్నం చేస్తోంది. దాంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ పై సమరశంఖం పూరిస్తోందన్న టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. గురువారం ఉమ్మడిజిల్లాలో భారీ ఎత్తున బీఆర్ఎస్ నిరసనలకు దిగింది. అటు ఎల్లారెడ్డిలో మంచి పట్టు ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి చవి చూడక తప్పలేదు. కాగా ఉమ్మడి జిల్లాలో పార్టీ రైతుల పక్షాన పోరాటం చేసి రోడ్లపై వచ్చు ఆందోళనకు చేయడానికి ముందుకు వస్తోంది. రైతులకు యూరియా అందించేందుకు పోరుబాట చేపట్టి ప్రజల తో మమేకమై ఉండాలని అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది సమస్యల పట్ల పోరాటం చేస్తేనే మనుగడ ఉంటుందని స్పష్టం చేసిన ధర్మల నాయకులు పోరాట సిద్ధమవుతున్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

-కే ఐ ఎఫ్ డి ఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బార్

కామారెడ్డి ,జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




ప్రైవేటు విద్యాసంస్థల వాహనాలు నడిపే డ్రైవర్లకు ఫిట్నెస్ పర్మిట్ దాటిన వాహనాలపై చర్యలుతీసుకోవాలి ఏ ఐ ఎఫ్ డీ ఎస్ రాష్ట్ర కార్యదర్శి జబ్బార్. కామారెడ్డి పటనం లో ఏ ఐ ఎఫ్ డీ ఎస్( అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య) ఆధ్వర్యంలో భరత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జబ్బార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులపై నియంత్రణమైన చట్టాన్ని అమలు చేయాలని , షూ, బెల్టు పాఠ్యపుస్తకాలు వ్యాను ఫీజులు అంటూ ఈ టెక్నో డీజె మెడికల్ అంటూ పర్మిషన్ లేకుండా ఇష్టానుసారంగా విద్యను వ్యాపారం చేస్తున్నారని అన్నారు ప్రైవేటు విద్యాసంస్థల వాహనాలు నడిపే డ్రైవర్లు కనీస విద్యా అర్హత ఫిట్నెస్ కొన్ని వాహనాలు పర్మిట్ దాటి కూడా ఉన్నాయి వాటిపై ఆర్టీవో అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు పర్మిషన్ లేకుండా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు కనీసం ప్రైవేటు పాఠశాలలో భద్రత లేదని సరిపడా మూత్రశాలలు, ఇరుకు గదులు, ఫైర్ సేఫ్టీ లేకుండా నడుస్తున్నాయని మండిపడ్డారు అలాంటి పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని అన్నారు స్థానిక విద్యాధికారులు ప్రైవేట్ విద్యాసంస్థలపై పరిరక్షణ కొనసాగించాలని అన్నారు కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్ పనిచేస్తున్న ఉపాధ్యాయులు కనీసం విద్యా అర్హత బీఈడీ, టెట్ క్వాఉపాధ్యాయులు విద్య బోధన చేపిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో రమేష్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## రికార్డ్ అసిస్టెంట్లకు రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఇంక్రిమెంట్లు మంజూరు పట్ల వర్షం

కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్రంలోని వీఆర్ఏలుగా పనిచేసి, అనంతరం రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ చైన్మెన్ కేడర్లలో విలీనం చేయబడిన ఉద్యోగులకు సంబంధించి చాలా కాలంగా పెండింగ్లో ఉన్న ప్రొబేషన్ డిక్లరేషన్, వార్షిక ఇంక్రిమెంట్లు మరియు సీనియారిటీ ఫిక్సేషన్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయడం పట్ల తెలంగాణ రాష్ట్ర రికార్డు అసిస్టెంట్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తోంది.దఈ అంశాల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర రికార్డు అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవీందర్ నాయకత్వంలో గత అనేక నెలలుగా సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ, ఆర్థిక శాఖ మరియు ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్ద నిరంతరం విజ్ఞప్తులు, ప్రాతినిధ్యాలు చేయడం జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రికార్డు అసిస్టెంట్ల సహకారంతో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేయడం జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వం వీఆర్ఏల నుండి రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు, చైన్మెన్లుగా నియమితులైన ఉద్యోగులను అన్ని విధాలుగా రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణిస్తూ, వారి ప్రొబేషన్ ప్రకటించడం, వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం మరియు సీనియారిటీ ఫిక్సేషన్ చేపట్టాలని స్పష్టమైన క్లారిఫికేషన్ ఇవ్వడం ఎంతో సంతోషకరమైన విషయం. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రికార్డు అసిస్టెంట్ అసోసియేషన్ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి కి, రెవెన్యూ శాఖ మంత్రి కి, ఆర్థిక శాఖ అధికారులకు, సీసీఎల్ఏ అధికారులకు ఈ అంశం పరిష్కారానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఇది రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ చైన్మెన్ ఉద్యోగుల హక్కుల సాధనలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని, ఇకపై ఉత్తర్వుల అమలుకు సంబంధించి కూడా అసోసియేషన్ పర్యవేక్షణ కొనసాగిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు మెట్టు రవీందర్ తెలిపారు.

## నేడే డ్రెయిన్ల పై ఆక్రమణలు తొలగింపు

తెలంగాణ పత్రిక, దమ్మపేట, జూన్ 19



దమ్మపేట ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ లపై ఆక్రమణ చేసిన వారు జూన్ 20వ తేదీ ఉదయం 9 గంటల లోపు స్వచ్ఛందంగా తొలగించాలని లేని పక్షంలో జెసిబి తో తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ సూచించారు. పాలకవర్గం తీర్మానం, అశ్వారావుపేట శాసనస భ్యులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ దమ్మపేట గ్రామ సభలో ప్రజల సమక్షంలో ఇచ్చిన ఆదేశాలు, ఎం.పి.డి.ఓ మరియు రోడ్డు భద్రత క్రింద పోలీస్ శాఖ వారి ఇచ్చిన ఆదేశాలు, గ్రామ ప్రజలు డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కంప్లైంట్ ఇవ్వడంతో చర్యలు చేపడుతున్నాము అని, నోటీసులు పలుమార్లు మైక్ తో అనౌన్స్మెంట్ చేశామని, తదుపరి పరిణామాలకు సంబంధిత వారే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ యోగ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ కె హైమవతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 19 (తెలంగాణ పత్రిక):

జిల్లా కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిద్దిపేట క్రికెట్ స్టేడియంను సందర్శించి ఈనెల 21 వ తేదీ ఆదివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనీ ఈ క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఉదయం 6 గంటలకు నిర్వహించనున్న అంతర్జాతీయ యోగ కార్యక్రమంలో దాదాపు 1000 పైగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అందరికీ సరిపడా యోగ మ్యాట్లు, తాగునీటివసతి, స్టేజ్ , అనౌన్స్మెంట్ తదితర అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంను భారీ స్థాయిలో నిర్వహించడం ద్వారా యోగ యొక్క గొప్పదనం గూర్చి తెలియజేసి అందరూ యోగ అభ్యసనం ద్వారా ఆరోగ్యంగా జీవించేలా చేయడమే చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవో సదానందం, ఆయుష్ డిపార్ట్మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో

## దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం



కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి మున్సిపల్ 13వ వార్డు టేక్రియాల్ శివాలయం దగ్గర డిడిఎన్ అధ్యక్షులు వాసుదేవరావు శర్మకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖక చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన ధూప దీప నైవేద్య అర్చకులు ఈ కార్యక్రమం. రాష్ట్ర నాయకులు సీర్ల వంచ కృష్ణమాచార్యులు జిల్లా అధ్యక్షులు అంజన్నప్ప మాట్లాడుతూ మా పూజారులకు దేవాదాయ శాఖ మాత్యులు కొండ సురేఖమ్మ గారు మహా ఆలయాలకు దర్శనార్థం వెళితే శీఘ్ర దర్శనం కొరకు జీవోను ఇవ్వడం శుభశోచకంగా భావిస్తున్నాం అలాగే రానున్న రోజుల్లో మాజీవితాలు చాలీచాలని వేదనంగా ఉన్నాయి కనుక 35 వేల వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు మరియు ఉద్యోగ భద్రత ఉదయాన్నే లేచి గుడికి వెళ్లి లేటుగా భోజన కార్యక్రమాలు చేయడం వలన రకరకాల ఆరోగ్య సమస్యలతో కూడా కొంతమంది ఆరోగ్య మెరుగు కొరకు మెడికల్ ట్రీట్మెంట్ ల కొరకు కొంత సానుకూలంగా ప్రభుత్వము మమ్మల్ని చూడాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి రాజశేఖర్ క్యాషియర్ భాస్కర్ సేవాలాల్ మహారాజ్ పూజారులు శివ మహారాజ్ శివ మహారాజ్ రామ్ మహరాజ్ సంగప్ప వీరప్రసాద్ లింగం శివ గురుమూర్తి ఎస్ ఎస్ నగర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ ప్రతినిధి జూన్ 19 తెలంగాణ పత్రిక.



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని చౌదరిగుడ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం నిమిత్తం రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ శుక్రవారం నాడు స్థల పరిశీలన చేశారు . రాష్ట్ర ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్లనిధులతో అన్ని హంగులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మినాలను చేపట్టనుండడంతో అందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యుడు ప్రకాష్ గౌడ్ శంషాబాద్ మండలంలోని చౌదరిగుడా గ్రామాన్ని ఎంపిక చేసి మండల రెవెన్యూ అధికారులతో గ్రామ సర్పంచ్ తో కలిసి స్థల పరిశీలన చేశారు . త్వరలోనే నిర్మాణానికై భూమి పూజ చేసి పనులు వేగవంతంగా ముగించే దిశగా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌదర్ గూడా సర్పంచ్ మన చలం లక్ష్మీ లింగం ఉపసర్పంచ్ సంతపురి ప్రేమ్ రాజ్, వార్డు సభ్యులు వివిధ గ్రామ సర్పంచులు, నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల చివరి దశ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

-అప్పుల ఊబిలో లబ్ధిదారులు.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం: భూపతి




కొత్తగూడెం, జూన్ 19:తెలంగాణ పత్రిక:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు చివరి దశ బిల్లులు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ జిల్లా నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఆశలు ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరుగారుతున్నాయని అన్నారు. ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరుకున్నప్పటికీ బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో వందలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణం చివరి దశ పూర్తి చేసేందుకు లబ్ధిదారులు బయట అప్పులు చేసి పనులు పూర్తి చేసుకున్నారని, నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా చివరి విడత బిల్లులు జమ కాకపోవడంతో అప్పుల భారం పెరుగుతోందని తెలిపారు. ఇల్లు వచ్చిందన్న ఆనందం కంటే అప్పులు ఎలా తీర్చాలన్న ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల చివరి దశ బిల్లులన్నింటినీ తక్షణమే విడుదల చేయాలని భూపతి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ మరమ్మతుకు నిధులు కేటాయించండి

కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)






కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లి జిల్లా పరిషత్ హై ప్రహరీ గోడ కూలిపోవడంతో పాఠశాల ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు ప్రహరీ గోడ నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన. స్థానికంగా స్పందించి బొంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రహరిగోడ లేక విష పురుగులు గేదలు ఆవులు మేకలు వస్తున్నాయని ఉపాధ్యాయులు స్థానికులు తెలిపారు. మరోసారి భూంపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ పై. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ మొండి వైఖరి. జిల్లా పరిషత్ పాఠశాలలకు నిధులు మంజూరు చెయ్యాలని గ్రామస్తులు మరియు ప్రధానోపాధ్యాయులు కోరగా స్థానికంగా స్పందించినా గాని పలు గ్రామాల పాఠశాలకు నిధులు మంజూరు చేసిన కానీ భూంపల్లి గ్రామానికి నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వల్లంపట్ల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నాయిని మల్లేశం గౌడ్



ఇల్లంతకుంట జూన్ 19 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట: వల్లంపట్ల గ్రామంలో కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో నడుస్తున్న పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నాయిని మల్లేశం గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నాయిని మల్లేశం గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు డైరెక్టర్లకు, పాల ఉత్పత్తిదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సి.హెచ్. వెంకట్ రాంరెడ్డి, పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నెల 20,21,22 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

-సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపు

కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈనెల 20,21,22 తేదీలలో మూడు రోజులపాటు మహబూబ్ నగర్ లో జరగనున్నాయని, శనివారం అనగా 20 వ తేదీన మధ్యాహ్నం మున్సిపల్ టౌన్ హాల్ నుండి భారీ ప్రదర్శన ఉంటుందని, ప్రదర్శన అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంబీసీ గ్రౌండ్లో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు.ఈ మహాసభలకు త్రిపుర



మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని గారు, ఝావీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సహా అగ్ర నాయకులంతా హాజరు కానున్నారని తెలిపారు. మహాసభలలో గత మూడు సంవత్స రాలలో వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు చేసిన పోరాటాలు సమీక్షించి, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి దానిని ఒక పథకంగా మార్చి ప్రజలకు ఉపాధిని దూరం చేస్తున్న యూనియన్ గవర్నమెంట్ విధానాలను సమగ్రంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల కాలంలో భూమిలేని పేదల కోసం చేసిన పోరాటాలను, పోరాట ప్రజల పట్ల ప్రభుత్వం అనుసరించి విధానాలను సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. మహాసభలకు జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# దోమకొండలో కోటలో వైభవంగా సామూహిక అక్షరాభ్యాస మహోత్సవం

-ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్‌లు అందజేత

కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతిని ధి)

కామారెడ్డి జిల్లాదోమకొండ ఫోర్ట్ & గ్రామ అభివృద్ధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శుక్రవారం దివంగత కోట వారసులు కామినేని ఉమాపతి జన్మదినాన్ని పురస్కరించుకొని సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దోమకొండ సర్పంచ్ శ్రీ నర్సయ్య , సీడీపీవోమతి రోషిమ్మ ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ మతి నల్లపు అంజలి , సిద్ధారెడ్డి , గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి విద్యారంభం చేయించారు. అనంతరం ట్రస్ట్ మేనేజర్ బాబ్జి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులు, ప్రణవి-



25,000/- సాయి తేజ-25,000/- భవాని-25,000/- అమూల్య-15,000/- భవిష్య-10,000/- లను ఘనంగా సన్మానించి వారికి స్కాలర్షిప్‌లు అందజేశారు. విద్యార్థుల కృషిని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్య అనేది ప్రతి చిన్నారి జీవితానికి పునాది అని, అక్షరాభ్యాసం ద్వారా విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టడం ఎంతో శుభప్రదమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దోమకొండ ఫోర్ట్ & గ్రామ అభివృద్ధి ట్రస్ట్ చేస్తున్న



సేవలు అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గణేష్ యాదవ్, రాజశేఖర్ వినయ్, వెంకట లక్ష్మి, కల్పన , అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సాయి గీత ఆశ్రమం సిద్ధం

-యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు జీవన విధానం సాయికుమార్

మేడ్చల్ జూన్ 19 (తెలంగాణ పత్రిక-

కొత్త తరం జీవనశైలిలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసానికి యోగా ఉత్తమ మార్గంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ఏడాది మెడ్చల్‌లోని సాయి గీత ఆశ్రమం ప్రకృతి ఒడిలో యోగా మహోత్సవాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న 550కు పైగా దివ్య వృక్షాల మధ్య జరిగే ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, ప్రశాంత వాతావరణం మధ్య యోగా సాధన చేయడం ద్వారా పాల్గొనేవారికి ద్విగుణీకృత ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఒత్తిడి, ఆందోళన, జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న




నేపథ్యంలో ప్రకృతి మధ్య యోగా చేయడం శరీరానికి మాత్రమే కాకుండా మనస్సుకు కూడా విశేష ఉపశమనం కలిగిస్తుంది. పక్షుల కిలకిలారావాలు, చెట్ల మధ్య వీచే స్వచ్ఛమైన గాలి, ఆధ్యాత్మిక వాతావరణం యోగా సాధనకు మరింత అనుకూలంగా మారుస్తాయి. దీంతో ఏకాగ్రత పెరగడంతో పాటు మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు అభివృద్ధి చెందుతాయి. పూజ్య సద్గురు శ్రీ శ్రీ శ్రీ సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ యోగా మహోత్సవంలో ప్రముఖ యోగా నిపుణులు పాల్గొని వివిధ యోగా ఆసనాల ప్రదర్శన, సాధన నిర్వహించనున్నారు. అలాగే ఆరోగ్యకర జీవనశైలి, సమతుల్య ఆహారం, మానసిక ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై విలువైన సూచనలు అందించనున్నారు. ఫన్ యాక్టివిటీలు, ఇంటరాక్టివ్ సెషన్లు, ప్రేరణాత్మక ప్రసంగాలు కార్యక్రమానికి మరింత ఆకర్షణగా నిలవనున్నాయి. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా జీవన విధానమని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. కుటుంబ సభ్యులందరూ కలిసి పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతితో మమేకమై ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, ఆధ్యాత్మిక ప్రశాంతతను పొందాలనుకునే ప్రతి ఒక్కరికీ సాయి గీత ఆశ్రమంలో జరగనున్న ఈ యోగా మహోత్సవం ఒక అరుదైన అవకాశంగా నిలవనుంది. జూన్ 21న ఉదయం 6:30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆశ్రమ నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు.

# అర్హత కలిగిన ప్రతి భారత పౌరునికి ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

- నంగునూరు తహశీల్దారు ప్రవీణ్ రెడ్డి

నంగునూరు, జూన్ 19(తెలంగాణ పత్రిక):

అర్హత కలిగిన ప్రతి భారత పౌరునికి ఓటు హక్కును కల్పించడమే ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వే లక్ష్యమని సిద్దిపేట జిల్లా నంగునూరు మండల తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలని చెప్పారు. సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ కోసం నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ఐఆర్)లో భాగంగా బూత్ స్థాయి ఏజెంట్లు(బీఎల్ఏ), బూత్ స్థాయి అధికారులకు(బీఎల్ఓలకు) శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నంగునూరు తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎర్రన్న గారి రాంగోపాల రెడ్డి, మండల గణేశ్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా



నంగునూరు తహశీల్దార్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మంగా తీసుకున్నదని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి బీఎల్వోలు తమకు కేటాయించిన ఓటర్ల ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. ప్రతి ఓటరుకు రెండు గణన ఫారాల చొప్పున అందిస్తారని చెప్పారు. గణన ఫరాలలో ఓటర్లు తమ వివరాలు, 2002 ఎస్ఐఆర్ ప్రకారం తమ రక్త సంబంధీకుల వివరాలను నింపి, బీఎల్ఓ లకు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రెండు చోట్ల ఉన్న ఓట్లను, ఓటర్ వివరాలు సరి లేక పోవడం, లేదా వారి పూర్వీకుల వివరాలు సరి లేకపోవడం, మొదలైన అంశాలను ఈ సర్వే ద్వారా గుర్తిస్తారని చెప్పారు. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించడంతో పాటు, అర్హత గల ప్రతి వ్యక్తి ఓటరుగా నమోదయ్యేవిధంగా చూడడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమన్నారు. రిసోర్స్ పర్సన్లు ఎర్రన్నగారి రాంగోపాల రెడ్డి, మండల గణేశ్ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి బీఎల్ఓలకు ప్రత్యేక బీఎల్ఓ ఎస్ఐఆర్ యాప్ మాడ్యూల్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీనిలో ఓటరు వివరాలను బీఎల్ఓలు నమోదు చేయాలని తెలిపారు. యాప్ ద్వారా ఓటరుకు సంబంధించిన పూర్తి వివరాలు ఎన్నికల సంఘానికి చేరుతాయని చెప్పారు. ఓటర్లు బాధ్యతతో తమకు ఇచ్చిన గణన పత్రాలను నింపి బీఎల్ఓలకు ఇవ్వాలని సూచించారు. బూత్ స్థాయి ఏజెంట్లు ఈ ప్రక్రియలో బీఎల్ఓలకు సహకరించాలని సూచించారు. ఉదయం , మధ్యాహ్నం రెండు విడతలుగా కొనసాగిన ఈ శిక్షణ కార్యక్రమంలో నంగునూరు మండలంలోని బీఎల్ఓలు, బీఎల్ఏలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, జూన్ 19,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)






ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి టి-స్వాన్ ద్వారా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్ , ఎన్.వి గిరి,సమందిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఓటరు జాబితా పరిశుద్ధత, ఖచ్చితత్వం కోసం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించి, వారి సూచనలు స్వీకరించాలని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన జుక్కల్ లో శిక్షణ బి ఎల్ వో లకు ఇవ్వనున్నట్లు తెలిపారు. డిఎల్ఓ లు తప్పని సరిగా ఐడి కార్డులు వేసుకోవాలని అన్నారు. జూలై 24వ తేదీలోగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి చేయడం, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం పూర్తిచేసి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు మీడియా, సోషల్ మీడియా, బ్యానర్లు, హోర్డింగ్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంకు హాజరైన

-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 19





గత ప్రభుత్వ హాయంలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేదల ఇంటి కల సహకారం చేస్తూ నిరుపేదలకు పక్కా ఇల్లు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు గ్రామ గ్రామాన మంజూరు చేసిందని గత ప్రభుత్వం ఏ గ్రామాలలోనైనా ఇల్లు ఇచ్చిన దాఖలు లేవని, తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లుగ్రామ గ్రామాన మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందని మెదక్ ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ అన్నారు. గురువారం చిన్న శంకరంపేట మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో ముంద్రాతి దశరథం ఇందిరమ్మ గృహప్రవేశానికి హాజరై రిబ్బన్ కట్ చేసి ఇంటిల్లిపాదులతో కలిసి గృహప్రవేశం చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో నిర్మించిన ఇండ్లే కనబడుతున్నాయని, బీఆర్ఎస్ హాయంలో ఒకటి కూడా కనిపించడం లేదని ఆవేదనవ్యక్తం చేశారు. అనంతరం గజగట్లపల్లి గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్ గజగట్లపల్లి సర్పంచ్ చిన్న శంకరంపేట సర్పంచ్ చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హ హాలావత్ మోహన్ నాయక్ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆవుల గోపాల్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాజీ జెడ్పిటిసి రమణ బందెల్లి సాయిల్ ముత్తుగళ్ళ రామచంద్రం గ్రామస్తులు పాల్గొన్నారు

# నీట్ రీటెస్ట్: సైబరాబాద్ పరిధిలో 163 సెక్షన్.. కఠిన ఆంక్షలు

-మొదటిపేజీ తరువాయి: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతం నేపథ్యంలో, జూన్ 21న నిర్వహించనున్న పునఃపరీక్షను అత్యంత పకడ్బందీగా జరిపేందుకు సైబరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిషేధాజ్ఞలు విధిస్తూ సీపీ డాక్టర్ ఎం. రమేశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం ఈ ఆంక్షలు అమలులోకి రానున్నాయి. ఆదివారం (జూన్ 21) ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పోలీసులు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడటంపై నిషేధం విధించారు. అదేవిధంగా, కేంద్రాలకు 100 మీటర్ల లోపు ఉన్న ఇంటర్నెట్ కేఫ్‌లు, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. అయితే, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సైనిక అధికారులు, హోంగార్డులతో పాటు అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు కల్పించారు. మే 3న జరిగిన నీట్-యూజీ పరీక్ష పత్రం లీకైనట్లు ఆరోపణలు రావడం, దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆ పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ కుంభకోణంపై ప్రస్తుతం సీబీఐ దర్యాప్తు కొనసాగుతుండగా, జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 73,000 మంది విద్యార్థులు 208 కేంద్రాల్లో ఈ పరీక్షకు హాజరుకానున్నారు. ఈ రీటెస్ట్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు జూలైకి వాయిదా వేయడంతో పరీక్ష నిర్వహణకు మార్గం సుగమమైంది. ఇప్పటికే నెలకొన్న అనిశ్చితి, మానసిక ఒత్తిడితో ఆందోళన చెందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ, పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఊహించి ఉండరు

-మొదటిపేజీ తరువాయి: ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఎవ్వరూ కలలోనూ ఊహించి ఉండరని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించామన్నారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా వెల్కమ్ కిట్స్ పంపిణీ, డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో పాటు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. '60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, వందలాది మంది యువత ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని మేం సంపూర్ణంగా విశ్వసించాం. విధ్వంసమైన విద్యావ్యవస్థను వికాసం వైపు నడిపించాలని నిర్ణయించాం. అందుకే బడ్జెట్‌లో విద్య కోసం 8.5 శాతం నిధులు కేటాయించాం. విద్యాభివృద్ధికి ప్రభుత్వం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది ఖర్చుగా కాదు.. భవిష్యత్తు తరాల కోసం పెట్టుబడిగా మేం భావిస్తాం. పదేళ్ల అధికారంలో ఉన్న వాళ్లు.. విద్యకు ప్రాధాన్యం ఇవ్వలేదు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు కూడా పెంచలేదు. మేం అధికారంలోకి రాగానే వాటి ఛార్జీలు పెంచాం. ప్రభుత్వ పాఠశాలలు మూసివేసి విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారు. విద్యాశాఖకు మంత్రి లేదంటూ కొందరు మాట్లాడుతున్నారు. పదేళ్ల వాళ్లు చేసిన విధ్వంసంతో వందేళ్ల నష్టం జరిగింది' అని రేవంత్ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.. 'అందుకే విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి పేదలకు విద్య అందించాలని ఆ శాఖను నా వద్దే పెట్టుకున్నా. ప్రీప్రైమరీ విధానం తీసుకొచ్చి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సి వస్తుందని ఎవ్వరూ కలలోనూ ఊహించి ఉండరు. ఆరుట్ల పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో అలాంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించి తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపబోతున్నాం. రాబోయే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. ఏఐ తుపాన్‌తో కోట్లాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. అందుకే బ్లూ కాలర్ జాబ్స్ వైపు దృష్టి సారించాం. యువతకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమాన్ని చేపట్టాం' అని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. విద్యార్థులకు ఇంగ్లీష్‌తో పాటు జర్మనీ, జపాన్ భాషను కూడా నేర్పిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. "ఐటీఐలను ఏటీసీలుగా మార్చాం. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. మీలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి పదునుపెట్టి గొప్పవాళ్లుగా తీర్చిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. సోషల్ వెల్ఫేర్‌లో చదువుకున్న విద్యార్థులు డాక్టర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, రాజకీయ నాయకులుగా ఎదగాలి. మీరంతా తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి. దేశాన్ని నడిపించే శక్తిగా ఎదగాలి. రేపటి భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంది.

# అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా..

-మొదటిపేజీ తరువాయి: అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. ఈ చర్చల్లో ఖతార్, పాకిస్థాన్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ విషయాన్ని స్విట్జర్లాండ్ విదేశాంగ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. చర్చల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన సన్నాహక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రస్తుతానికి దీనిపై మరింత సమాచారం ఇవ్వలేమని పేర్కొంది. మరోవైపు, ఇరాన్‌తో సాంకేతిక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేపట్టాల్సిన పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. అయితే, చర్చల కోసం సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందం అమలు లక్ష్యంగా తదుపరి దశ చర్చలు ప్రారంభించడంపై ఇరుపక్షాలు దృష్టి సారించాయని తెలిపింది. "లాజిస్టిక్స్ పరమైన అంశాలు ఎప్పుడూ సులభంగా ఉండవు" అని వైట్‌హౌస్ ప్రతినిధి పేర్కొన్నారు. అంతకుముందు, వైట్‌హౌస్‌లో మాట్లాడిన వాన్స్.. ఈ వారాంతంలోనే చర్చలు ప్రారంభం కావచ్చని అంచనా వేశారు. అయితే, ఇరాన్ నుంచి ప్రతినిధులు బయటకు రావడం అంత సులభం కాదని, సమన్వయం సవాలుగా మారిందని ఆయన అంగీకరించారు. అమెరికా బృందానికి తానే నాయకత్వం వహించనున్నట్టు స్పష్టం చేశారు. ఇప్పటికే కుదిరిన రాజకీయ ఒప్పందాన్ని ఆచరణలో పెట్టడం, దాని అమలు, పర్యవేక్షణ, నిబంధనలపై స్పష్టత కోసం ఈ చర్చలు జరగాల్సి ఉంది. "మేము మాటలను నమ్మం. చేతలను, ప్రవర్తనను మాత్రమే విశ్వసిస్తాం" అని వాన్స్ పేర్కొంటూ, చర్చల్లో అమెరికా వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించనప్పటికీ, వీలైనంత త్వరగా చర్చలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

# పోడు రైతులకు అధైర్యపడవద్దు అండగా ఉంటాం : ఎమ్మెల్యే పాయం

-అటవీశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి,మళ్లీ సర్వే నిర్వహించాలని ఆదేశం.



తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 19.

పినపాక మండలంలోని బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాలకు చెందిన గిరిజన పోడు రైతుల సమస్యపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తక్షణమే స్పందించారు. అటవీశాఖ అధికారులు తమను వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని రైతులు పినపాక మండలంలో పర్యటించిన ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రంపై ఆయన సానుకూలంగా స్పందించి, వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.గత కొంతకాలంగా బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాల్లోని సుమారు 45 గిరిజన కుటుంబాలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. అయితే ఇటీవల అటవీశాఖ అధికారులు వారి వ్యవసాయ పనులను అడ్డుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ జీవనాధారమైన భూములను కాపాడాలని కోరుతూ గిరిజన రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి తమ సమస్యను వివరించారు. రైతుల ఆవేదనను విన్న ఎమ్మెల్యే వెంటనే అటవీశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గిరిజన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సంబంధిత భూములపై మరోసారి సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన గిరిజన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, వారి హక్కులను పరిరక్షించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే స్పందనపై బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాల గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# కట్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలు ఘనంగా

-రంగారెడ్డి జిల్లా



శేరిలింగంపల్లి నియోజకవర్గం,జూన్ 19 (తెలంగాణ పత్రిక)

శేరిలింగంపల్లి నియోజకవర్గం నల్లగండ్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కట్ల శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం, యువత సాధికారత, రైతుల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తున్న నాయకుడిగా ఆయనను కొనియాడారు. సామాన్య ప్రజల గొంతుకగా నిలుస్తూ వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో మరింత కీలక పాత్ర పోషిస్తారని, భారతదేశ ప్రముఖ నాయకుల్లో ఒకరిగా ఎదుగుతారని కట్ల శేఖర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రాహుల్ గాంధీ దీర్ఘాయుష్షుతో, సంపూర్ణ ఆరోగ్యంతో, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు..

# కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సానిటరీ ప్యాడ్ల పంపిణీ



భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 19

పాల్వంచ మండలంలోని జగన్నాధపురం ప్రభుత్వ జెడ్పి పాఠశాలలో చదువుతున్న బాలికలకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సానిటరీ ప్యాడ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కొల్లి ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్పనా చౌదరి విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గత సంవత్సరాల్లో నిర్వహించిన పరిశీలనల్లో ఆడపిల్లలు పాఠశాల మానివేయడానికి (స్కూల్ డ్రాప్‌అవుట్) కారణమయ్యే అంశాలలో రుతుక్రమ పరిశుభ్రత ఆరోగ్య సంబంధిత సమస్యలు కూడా ఒకటిగా గుర్తించామని తెలిపారు. విద్యార్థినుల విద్యతో పాటు వారి ఆరోగ్యం, భద్రత పట్ల కూడా కొల్లి ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆడపిల్లల హాజరు శాతాన్ని పెంచడం, వారికి రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, విద్యను మధ్యలో నిలిపివేయకుండా ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అలాగే విద్యార్థినులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, మంచి విద్యను అభ్యసించి, ఉత్తమ ఫలితాలు సాధించి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, కొల్లి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లా నాయక్, విద్యార్థినులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం



తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 19.

పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కరకగూడెం మండలానికి చెందిన 23 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11,27,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ప్రజల అవసరాల సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ, వైద్య ఖర్చులు మరియు ఇతర అత్యవసర అవసరాలకు సహాయం అందిస్తోందని తెలిపారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో యువత, రైతులు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధీ నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కరకగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగబండి వెంకటేశ్వర్లు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు, మాజీ సర్పంచ్ తోలెం నాగేశ్వరరావు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# టిఆర్ఎస్ కవిత ప్రశ్నలకు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిలు సమాధానం చెబుతాయా..!



-సిరిసిల్ల రాజకీయాల్లో దుమారం రేపిన కవిత.

తెలంగాణ పత్రిక ప్రతినిధి సిరిసిల్ల:

సిరిసిల్ల పర్యటనలో "తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కవిత అటు అధికార పక్షాన్ని అటు ప్రతిపక్షాన్ని ప్రశ్నించిన తీరు ఆ ప్రశ్నలకు ఆ పార్టీలు సమాధానం చెబుతాయా అన్న చర్చ సిరిసిల్ల నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది ప్రభుత్వంపై అనేక ప్రశ్నలను కవిత సంధించారు. తొమ్మిది సంవత్సరాలుగా మానని గాయం నేరెళ్ల ఘటన .ఈ విషయంలో అటు బిఆర్ఎస్ ను ఇటు కాంగ్రెస్, బిజెపి పార్టీలను సూటిగా కవిత ప్రశ్నించారు. అక్రమ ఇసుక రవాణా కోసం నేరెళ్ల లో జరిగిన దమన కాండ పై ఆనాటి అధికార పార్టీ నాయకుడైన స్థానిక శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు అంటి ముట్టనట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు నేరెళ్ల బాధితుల పక్షాన నిలబడి కేంద్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ను రప్పించిన బిజెపి నాయకులు బండి సంజయ్ నివేదికలో ఏం స్పష్టం చేసిందన్న విషయాన్ని ఇప్పటికైనా బయటపెట్టి నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగేలా విషయాలను బహిర్గతం చేయాలని సూటిగా ప్రశ్నించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకుల సైతం నేరెళ్ల బాధితులకు న్యాయం చేస్తామంటూ నమ్మబలికి మరోసారి నేరెళ్ల బాధితులను విస్మరించారని ఆరోపించారు.

**'సెస్ 'విషయంలో కేటీఆర్ ఎందుకు నోరు విప్పలేదు..!**

దేశంలోనే సహకార రంగంలో పేరు ప్రతిష్టలు సంపాదించిన "సెస్" విషయంలో గతంలోనే కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలనే ప్రయత్నం జరిగిందని చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం సెస్ కు మంగళం పాడిందని ఆరోపించారు. సెస్ విలీనం దశకు పోయిన పరిస్థితులపై కేటీఆర్ మౌనం వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం సిరిసిల్ల నియోజకవర్గ ప్రజల ఆలోచనలు ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు సెస్ విలీనం విషయం లో మౌనం వహించడంపై కేటీఆర్ ప్రజలకు ఏం సమాధానం చెబుతారో వేచి చూడవలసి ఉంది. రైతులకు ప్రయోజనం చేకూర్చే రైతుల డిస్కం ప్రతిపాదనలు ఎలా ఆవిరైపోయాయో ప్రజలు ఆలోచించాలని కవిత కోరారు.

**వర్కర్ టు ఓనర్ పథకంపై సూటిగా నిలదీసిన కవిత.**

రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో నేత కార్మికులు ఉన్న సిరిసిల్లకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ విషయంలో గతంలో నేత కార్మికులను ఊరించి ఉసురు మనిపించిన పథకం "వర్కర్ టు ఓనర్".గతంలో స్థానిక శాసనసభ్యులు కేటీఆర్ పెద్దూరు సమీపంలోని ఆపేరాల్ పార్క్ లో వర్కర్ టు ఓనర్ పథకం కోసం సామూహిక వర్క్ షెడ్ల నిర్మాణం కూడా కొంత జరిగింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి అసలు వర్కర్ టు ఓనర్ పథకం ఉందా లేదా అన్న విషయంపై ఇలాంటి స్పష్టత ఇచ్చిన పరిస్థితి లేదు. ప్రస్తుతం ఆపేరాల్ పార్కులోని షెడ్లను వడ్ల గోదాముల కోసం వాడడంపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల నేత కార్మికులు తాము ఓనర్లు మారుతామన్న కల గానే మిగిలింది.ఈ విషయంలో అధికార పక్షం, ప్రతిపక్షమైన బిఆర్ఎస్ ఎలా స్పందిస్తుందో అన్న విషయంలో సిరిసిల్ల పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంలో మారింది.




**రైతుల పట్ల పట్టింపేది.**

సిరిసిల్ల నియోజకవర్గంలో రైతుల పట్ల పాలక పార్టీకి కనీసం పట్టింపు కూడా లేకుండా పోయిందనేది కవిత ఆవేదన వ్యక్తం చేశారు.. సిరిసిల్ల నియోజకవర్గంలోని రైతులకు 1లక్ష 80 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేకపోయిందని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా స్పందించిన పరిస్థితి లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రస్తుతం సిరిసిల్ల నియోజకవర్గంలో కేవలం 480 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని రైతులు తీవ్ర ఇబ్బందులు ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. సిరిసిల్ల పర్యటనలో కవిత అనేక ప్రశ్నలను సంధించారు. ప్రజల పక్షాన అటు ప్రభుత్వంపై ఇటు ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్ కవిత ప్రశ్నలకు ఆ పార్టీలు సమాధానం చెబుతాయా అన్న విషయం పై ప్రజల్లో విస్తృతంగా చర్చ నడుస్తోంది.

అల్లే రమేష్ సిరిసిల్ల.

# సిరిసిల్ల రాజకీయాలను టిఆర్ఎస్ ప్రభావం చేయనుందా..!

సిరిసిల్ల నియోజకవర్గం ఏర్పడిన నాటినుండి అటు రాజకీయ పార్టీలకు జవసత్వాలను అందించి ఆ రాజకీయ పార్టీల భవిష్యత్తు బాటలు వేసింది. ఉమ్మడి రాష్ట్రం లో కమ్యూనిస్టు, కాంగ్రెస్, టిడిపి, అనంతరం తెలంగాణ రాష్ట్ర సమితి కి సిరిసిల్ల రాజకీయ భవిష్యత్తు అందిస్తూ వస్తుంది. ఎన్నో రాజకీయ పరిణామాలకు సిరిసిల్ల వేదిక గా నిలుస్తుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు వెన్నంటే సిరిసిల్ల ప్రజలు నడుస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు చెబుతూ వస్తున్నారు. పరిస్థితులు కూడా అవే రుజువు చేస్తున్నట్లు కనిపిస్తుంది.



అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు కొత్త రాజకీయ మార్పులకు, మలుపులకు, వేదిక కాబోతున్నాయా అన్న అంశం తీవ్రంగా చర్చనీయాంశంగా మారుతుంది. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఇటీవల అనుహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సమితి కాస్త భారత రాష్ట్ర సమితిగా మారిన అనంతరం ఆ పార్టీలు చోటుచేసుకున్న పరిణామాలు మూలంగ కవిత ఆ పార్టీకి దూరం కావాల్సి వచ్చింది. రాజకీయాల్లో కెసిఆర్ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నదాని కవిత గురించి రాజకీయ పరిశీలకు చెబుతుంటారు. కవిత తెలంగాణ రాష్ట్ర సమితిలో కొనసాగుతున్న కాలంలోనే 'తెలంగాణ జాగృతి"ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ రాజకీయలలో ప్రత్యేక ముద్ర వేస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా "తెలంగాణ జాగృతి " ద్వారా పలువురు అభ్యర్థులను బలపరిచి రాజకీయ సమీకరణలపై ఆమె ప్రభావం చూపినట్లు రాజకీయ పరిశీలకు చెబుతున్నారు.

అనూహ్యంగా ప్రత్యక్షంగా తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పుతూ తన ప్రత్యేక ముద్రను తెలంగాణ రాజకీయాల్లో చూపించాలని భావిస్తున్న కవిత ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్ర సేన"ఏర్పాటు పై రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలు లను వ్యక్తం చేసిన రాష్ట్ర రాజకీయాల్లో "తెలంగాణ రాష్ట్ర సేన" ఏ మేరకు ప్రభావం చూపుతుందో అన్న విషయంలో ప్రజల్లో ఆసక్తికర మైన చర్చ జరుగుతున్నట్లు గమనించవచ్చు రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. "తెలంగాణ రాష్ట్ర సేన "ఏర్పాటు తర్వాత ఎన్ని వివర్శలు వచ్చిన లెక్కచేయకుండా తాను ఎంచుకున్న మార్గంలో నడుస్తున్న కవిత టిఆర్ఎస్ ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తుంది.

సిరిసిల్ల నియోజకవర్గంలో గురువారం టిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండగపై ఆసక్తికరమైన చర్చ నియోజకవర్గంలో కొనసాగుతోంది. భారత రాష్ట్ర సమితి కి పెట్టని కోటల నిలబడ్డ సిరిసిల్ల ఓటర్ల పై ఏ మేరకు కవిత టిఆర్ఎస్ ప్రభావం పడుతుందొనన్న ఆసక్తికర చర్చ ఇప్పుడు నియోజకవర్గంలో హాట్ టాపిక్ మారింది.

-సిరిసిల్ల రాజకీయాల్లో కల్వకుంట్ల తారక రామారావు ప్రత్యేక ముద్ర.

సిరిసిల్ల నియోజకవర్గంలోని రాజకీయాల్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ప్రత్యేక ముద్ర వేశారని చెప్పవచ్చు. కేటీఆర్ ప్రత్యక్ష రాజకీయాలలో తొలిసారిగా సిరిసిల్ల శాసనసభ్యులు గా 2009 లో అప్పటి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న కే.కే. మహేందర్ రెడ్డి పై కేవలం ఒక 1 71 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో గెలుపొందారు. 2014 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జరిగిన ఎన్నికల్లో కల్వకుంట్ల తారక రామారావు 26. 93 శాతం నుండి 58. 73 శాతం వరకు ఓట్ల శాతం పెరిగినట్లు గమనించవచ్చు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొత్తంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సానుకూల వాతావరణం సిరిసిల్లలో కూడా అప్పట్లో కల్వకుంట్ల తారక రామారావు కలిసి వచ్చిందని భావించవచ్చు.2018 లో కల్వకుంట్ల తారక రామారావు సిరిసిల్ల నియోజకవర్గం అత్యధిక మెజారిటీ నీ అందించింది. తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ ప్రభావం చూపిన 2023 ఎన్నికల్లో కూడా భారత రాష్ట్ర సమితి నుంచి కల్వకుంట్ల తారక రామారావు అనేక రాజకీయ అంచనాలను తలకిందులు చేస్తూ మరోసారి విజయబావుట ఎగురవేశారు. ఏ ఎన్నికల్లో అయిన తన ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూపిస్తూ సిరిసిల్ల నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా భారత రాష్ట్ర సమితి నిలబెడుతూ వస్తున్న పరిస్థితిని గమనించవచ్చు. అంతెందుకు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన ఫలితాలను గమనిస్తే కేటీఆర్ ప్రభావం గమనించవచ్చు ప్రతిపక్ష పార్టీగా ఉన్న భారత రాష్ట్ర సమితి నుంచి నేరుగా సిరిసిల్ల మున్సిపాలిటీలో 29 మంది కౌన్సిల్ సభ్యులనుగెలిపించుకొని తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు. గతంలో అధికారంలో ఉన్న నాటికంటే ఈ సంఖ్య ఎక్కువే ఇలా తిరుగులేని శక్తిగా ఉన్న భారత రాష్ట్ర సమితి పై కవిత టిఆర్ఎస్ ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్న విషయంపై ఇప్పుడు నియోజకవర్గంలో తీవ్ర ఆసక్తికర చర్చను గమనించవచ్చు.

-అన్న కోటలో చెల్లి జెండా పండుగ.

రాజకీయ పార్టీ గా "తెలంగాణ రాష్ట్ర సేన 'ఏర్పాటు తర్వాత తొలిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జెండా పండుగలో కవిత పాల్గొనడం ఏలాంటి రాజకీయ సమీకరణలకు మార్పులకు దారితీస్తుందో అన్న విషయం పై ఇప్పుడు రాజకీయ పరిశీలకులు అనేక ఊహాగానాలు చేస్తున్నారు.

ప్రధానంగా సిరిసిల్ల నియోజకవర్గంలో ని ఎల్లారెడ్డిపేట ముస్తాబాద్ గంభీరావు పేట, వీర్నపల్లి మండలాల నుండి జన సమీకరణ ఎక్కువగా జెండా పండగ కోసం జరిగినట్లు గమనించవచ్చు. అయితే రానున్న రోజుల్లో కవిత తెలంగాణ రాష్ట్ర సేన టిఆర్ఎస్ ఏ మేరకు ప్రభావితం చేస్తుందో.? టిఆర్ఎస్ రూపంలో రాజకీయ ఆధిపత్యం కోసం అన్నపై చెల్లి చేస్తున్న పోరాటం ఏ పార్టీకి ఏ రూపంలో కలిసి వస్తుందన్న విషయంలో ఎవరి అంచనాలు వారికి ఉన్నట్లు కనిపిస్తుంది.

ఇప్పటికైతే సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ భారత రాష్ట్ర సమితి భారతీయ జనతా పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ లే కాక పలువురు స్వతంత్ర అభ్యర్థులు సిరిసిల్ల నియోజకవర్గంలో అధిక శాతం ఉన్న సామాజిక వర్గం నుంచి పలువురు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్న విషయం గమనంలో ఉంచుకుంటే ప్రస్తుతానికైతే సిరిసిల్ల నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఉన్న బిఆర్ఎస్ కే కాక మిగిలిన రాజకీయ పార్టీలకు ఇప్పుడు కవిత టిఆర్ఎస్ కూడా తెర"పైకి రావడం ప్రజల్లో కొత్త అంచనాలపై ఆసక్తికర చర్చ మాత్రం నడుస్తోంది.

అల్లే రమేష్, సిరిసిల్ల.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

# తెలుగు రాష్ట్రాల్లో తొలి వందే భారత్ స్లీపర్.. ఈ రూట్లోనే ప్రయాణం.. రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్

తెలంగాణ పత్రిక ప్రతినిధులు

తెలుగు రాష్ట్రాల్లో తొలి వందే భారత్ స్లీపర్ రైలుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు రైల్వేశాఖ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మార్గాన్ని కూడా ఖరారు చేసింది. దేశంలో తొలి స్లీపర్ రైలును హౌరా-గువహతి మధ్య ప్రారంభమైంది. త్వరలోనే మరిన్ని రైళ్లు రానున్నాయితెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. ఏపీ, తెలంగాణ మీదుగా ఇప్పటికే పలు వందే భారత్ రైళ్లు నడుస్తున్న విషయం తెలిసిందే. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు లాంటి ప్రధాన నగరాల మధ్య ఈ రైళ్లు కనెక్టివిటీని అందిస్తున్నాయి. వీటి రాకతో వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఉన్న ఈ రైళ్లల్లో స్లీపర్ కోచ్‌లు లేవు. కేవలం కూర్చోని మాత్రమే ప్రయాణం చేసే సౌకర్యం ఉంది. దూరపు ప్రయాణాలు చేసేవారు ఎక్కువదూరం కూర్చోని ప్రయాణం చేయడం కష్టమైన పని. అందుకే రైల్వేశాఖ వందే భారత్ స్లీపర్ కోచ్‌లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇప్పటికే హౌరా-గువహతి మధ్య తొలి స్లీప్ ట్రైన్ ప్రారంభమవ్వగా.. మరిన్ని స్లీపర్ రైళ్లను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది


తెలుగు రాష్ట్రాల్లో తొలి వందే భారత్ స్లీపర్..

తెలుగు రాష్ట్రాల్లో తొలి వందే భారత్ స్లీపర్ రైలు ఎప్పుడు, ఏయే మార్గాల్లో అందుబాటులోకి వస్తుందనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. అయితే ఇందుకు మార్గం సుగమం అయింది. సికింద్రాబాద్-ఢిల్లీ మధ్య వందే భారత్ స్లీపర్ ట్రైన్ ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలను అనుసంధానం చేసేలా రాత్రిపూట ప్రయాణికుల కోసం స్లీపర్ రైళ్లను కేంద్రం అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా న్యూఢిల్లీ-సికింద్రాబాద్ మార్గం కూడా ప్రస్తావనకు వచ్చింది. రానున్న రోజుల్లో ఈ కారిడార్‌లో వందే భారత్ స్లీపర్ రానుంది. దీని వల్ల సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.ఈ మార్గాల్లో కూడా..

ఇక ఈ రూటుతో పాటు న్యూఢిల్లీ-శ్రీనగర్, ముంబై-అహ్మదాబాద్ , న్యూఢిల్లీ-పుణె, న్యూఢిల్లీ-చెన్నై, న్యూఢిల్లీ-హౌరా, న్యూఢిల్లీ-అహ్మదాబాద్, న్యూఢిల్లీ-ముంబై, ముంబై-బెంగళూరు మధ్య వందే భారత్ స్లీపర్ రైళ్లను రానున్న సంవత్సరాల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే వందే భారత్ స్లీపర్ రైల్ సెట్లు తయారుచేస్తున్నారు. శరవేగంగా వీటి తయారీ జరుగుతోంది. వీటి తయారీ పూర్తయిన తర్వాత విడతల వారీగా వందే భారత్ స్లీపర్ రైళ్లను కేంద్రం పట్టాలెక్కించనుంది. రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో అన్ని ప్రధాన నగరాలను అనుసంధానించేలా స్లీపర్ రైళ్లు రానున్నాయి. దీని వల్ల రాత్రిపూట ప్రయాణం మరింత సులువు కానుంది. ఈ రైళ్లల్లో ఎలాంటి శబ్దాలు, కుదుపులు అనేవి ఉండవు. ఈ ఏడాది జనవరిలో హౌరా-గువహతి మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రధాని మోదీ ప్రారంభించారు. ప్రయాణికుల నుంచి దీనికి మంచి స్పందన లభిస్తోంది. ఆక్సుపెన్సీ రోజురోజుకి పెరుగుతోంది. ఈ రైళ్లకు డిమాండ్ పెరుగుతోంది.

# రాజ్యసభలో పెరుగుతున్న బీజేపీ బలం.. మూడింట రెండు వంతుల మెజారిటీ దిశగా ఎన్డీఏ..!

తెలంగాణ పత్రిక ప్రతినిధి



కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుంటున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది. దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోందికేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఇప్పుడు రాజ్యసభలోనూ తన బలాన్ని మరింత పెంచుకుం టున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏకు అనుకూలంగా రావడంతో, ఆ కూటమి సంఖ్యాబలం గణనీయంగా పెరిగింది. దీంతో భవిష్యత్తులో కీలక బిల్లులను ఆమోదించుకునే దిశగా బీజేపీ మరింత బలపడుతున్నట్లు కనిపిస్తోందిజూన్ 18 వరకు దేశంలోని 10 రాష్ట్రాల్లో 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎక్కువ స్థానాలు ఎన్డీఏ ఖాతాలోకి వెళ్లాయి. తొలుత ఏకగ్రీవంగా ఎన్నికైన 24 మంది సభ్యుల్లో 19 మంది ఎన్డీఏ కూటమికి చెందినవారు కాగా, జార్ఖండ్‌లో జరిగిన ఎన్నికలో పరిమల్ నత్వానీ విజయం సాధించడంతో ఆ సంఖ్య 20కి చేరింది. ప్రస్తుతం రాజ్యసభలో ఎన్డీఏ కూటమి మొత్తం బలం 152 స్థానాలకు చేరినట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీకి ఎన్డీఏ కేవలం 11 సీట్ల దూరంలో ఉండటం విశేషం. దీంతో భవిష్యత్తులో రాజ్యాంగ సవరణలకు సంబంధించిన కీలక బిల్లులను సులభంగా ఆమోదించే అవకాశం ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇక పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు కూడా ఎన్డీఏకు కలిసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంతో ఆ స్థానాలపై చర్చ మొదలైంది. భవిష్యత్తులో మరికొంతమంది ఎంపీలు కూడా పార్టీని వీడే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. అలాంటి పరిస్థితి ఏర్పడితే, ఆ ఖాళీ స్థానాలను బీజేపీ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

అదే సమయంలో బిజూ జనతా దళ్ (బీజేడీ), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) వంటి పార్టీలు అధికారికంగా ఏ కూటమిలోనూ లేకపోయినా, పలు కీలక సందర్భాల్లో ఎన్డీఏకు మద్దతు ఇస్తూ వచ్చాయి. బీజేడీకి ఐదుగురు, వైఎస్సార్‌సీపీకి ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఉండటం కూడా ఎన్డీఏకు అదనపు బలంగా మారే అవకాశం ఉంది.

ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష భారత కూటమి బలం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి మిత్రపక్షాలు దూరం కావడంతో ఆ కూటమి సంఖ్య 64 మంది సభ్యుల వద్దే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ఎన్డీఏ ఆధిపత్యం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

# రైతులకు సకాలంలో యూరియా అందుబాటు



-జిల్లాలో యూరియా బుకింగ్‌లలో 72.66 శాతం పంపిణీ పూర్తి.
-జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు.




భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 19

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన యూరియా బుకింగ్ విధానం జిల్లాలో విజయవంతంగా అమలవుతోందని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలిపారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచడంతో పాటు, బుకింగ్ చేసిన రైతులకు వేగవంతంగా సరఫరా చేస్తున్నామని అన్నారు . జూన్ 19, 2026 నాటికి జిల్లాలో మొత్తం 10,014 మంది రైతులు యూరియా బుకింగ్ చేసుకోగా, 39,944 బస్తాల యూరియా బుక్ చేయబడింది. ఇందులో 28,980 బస్తాలు రైతులకు పంపిణీ చేయడం ద్వారా 72.66 శాతం సరఫరా పూర్తయింది. ప్రస్తుతం జిల్లాలో 1,304.10 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పిఎసిఎస్ రైతు వేదికలు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏఈఓలు, ఏఓలు, మండల వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎరువుల పంపిణీని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. రైతులు అవసరమైన మేరకు మాత్రమే యూరియాను బుక్ చేసుకోవాలని, అధికంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని సూచించారు. రైతులు యూరియా బుకింగ్, సరఫరా ఇతర వ్యవసాయ సేవలకు సంబంధించి సమీప వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ)లను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలిపారు.

# బడి బస్సుల భద్రత ఎంత

- ప్రైవేటు విద్యాసంస్థల కాసుల కక్కుర్తి
- అధికారుల ఉదాసీనత ఖరీదు పసివాళ్ల ప్రాణాలు
- కాగితాల్లో ఉన్న నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా..?
- అధికారులు స్కూల్ బస్సులపై నిఘా పెంచాల్సిందే..!
- ప్రైవేట్ బడిబస్సుల ప్రయాణాలు పదిలమేనాలి

తమ బిడ్డలకు ఉజ్వల భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో లక్షలాది రూపాయలు వెచ్చించి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్స్‌కు పంపిస్తున్నారు. మరి ఆ బస్సులు భద్రమేనా ? అనే సందేహాలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. స్కూల్ యాజమాన్యాలు తమ పాఠశాలల్లో చక్కగా చదువు నేర్పిస్తామని ఆశ కల్పించటంతో తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో విద్యార్థులను పంపిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆందోళనగానే ఉంటున్నారు. నిరంతరం ప్రైవేట్ స్కూల్ బస్సులపై పర్యవేక్షణ చేయాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు ఏమైనా జరిగినప్పుడు హడావిడి చేసేసి అనంతరం ప్రైవేట్ బస్సుల ఫిట్నెస్ గురించి పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి.

మేడ్చల్, జూన్ 19(తెలంగాణ పత్రిక) :

ప్రైవేట్ స్కూల్ బస్సుల ఫిట్ నెస్ విషయంలో రవాణా శాఖ అధికారులు ఫిట్ నెస్ పట్టించుకోవటం లేదనే విమర్శలు దారాళంగా వినబడుతున్నాయి. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంతో రవాణ శాఖ మిలాఖత్ అవ్వటం, మామూళ్లు చెల్లించి రోడ్లపై ఫిట నెస్ సరిగా లేని డొక్కు బస్సులు వినియోగిస్తున్నట్లు తెలియవస్తుంది. ఆ డొక్కు బస్సుల్లోనే విద్యార్థులను స్కూళ్లు, కళాశాలలకు తీసుకెళ్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. మేడ్చల్ మండలంలోని పెద్ద విద్యాసంస్థల్లో కొత్త బస్సులతోపాటు పాత బస్సులు కూడా ఉన్నాయి. వాటికి తాత్కాలిక మరమ్మత్తులు చేసి రోడ్ల మీదకు పంపుతుండటంతో ప్రమాదం జరిగిన తర్వాత స్పందిస్తారే తప్పా ముందుగా అధికారులు ఎందుకు స్పందించటం లేదనే విమర్శలు తల్లిదండ్రులు గుప్పిస్తున్నారు.

ప్రతీ ఏడాది బ్రేకు వెళ్తున్నాయా? :

ప్రతీ ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలో ఫిట్ నెస్ ఉందో లేదో తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత రవాణ శాఖ అధికారులపై ఉంది. స్కూల్ యాజమాన్యం ఆ బస్సులను బ్రేక్ కు తీసుకెళ్లాల్సి ఉండగా, ఆ సమయంలో రవాణాశాఖ అధికారులు వాటి ఫిట్ నెస్ చూసి ఫర్ఫెక్ట్ ఉన్నాయో ? లేదో చూడాల్సిన బాధ్యత ఉంది. కానీ అది కూడా తూతూ మంత్రంగానే చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ...? :

గత విద్యా సంవత్సరంలో ప్రైవేటు బస్సులు ఆగిపోవడం, కిక్కిరిసిన బస్సుల్లో విద్యార్థులను ఎక్కించుకోవడం జరిగింది. మండలంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఫిట్ నెస్ సరిగ్గా లేకపోయినప్పటికీ అధికారులను మేనేజ్ చేసి బస్సులను రహదారులపై తిప్పుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా మేడ్చల్ మండలంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు నిత్యం తనిఖీలు చేసి, ఫిట్ నెస్ సరిగా లేని బస్సులను నడపకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తక్కువ జీతాల కోసం అనాథులు :

భారీ వాహనాలు నడిపిన అనుభవం లేని వారిని, హెవీ లైసెన్స్ లేని క్లీనర్లను తక్కువ జీతాలకు దొరుకుతున్నారని డ్రైవర్లుగా పెట్టుకుంటున్నారు. డ్రైవర్లకు కనీస వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడం లేదు. ఆ రోజు అవసరం నిమిత్తం బస్సు నడపగలితే చాలు అన్నట్లుగా డ్రైవర్లను నియమిస్తున్నారు కొన్ని విద్యాసంస్థలు. బస్సుల కండిషనన్ను మాత్రం ఏమాత్రం ఖాతరు చేయడం లేదు.

సామర్థ్య ధ్రువీకరణ తప్పనిసరి :

పదుల సంఖ్యలకు పైగా ప్రైవేట్ స్కూల్ బస్సులు కనీస సామర్థ్య ధ్రువీకరణ పత్రం లేకుండానే రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. స్కూళ్లు తెరిచే ముందు హడావుడి చేసే ఆర్టీఏ అధికారులు, ఆ తర్వాత ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిళ్లకు తలొగ్గి తనిఖీలను గాలికొదిలేస్తున్నారు. అత్యధిక బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్ తలుపులు తుప్పుపట్టి తెరుచుకోని స్థితిలో ఉన్నాయి. మరికొన్ని బస్సుల్లో ఆ ద్వారాలకు అడ్డంగా సీట్లు వేసి అదనపు విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఉన్నా, వాటిలో అత్యవసర మందులు ఉండవు. ఒకవేళ ఉన్నా అవి ఎప్పుడో కాలంచెల్లిన మందులే ఉంటున్నాయి.

# దరిపల్లి మాజీ ఎంపి టీసీ, సభ్యులు అంజాగౌడ్ మృతి



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 19

చిన్నశంకరంపేట మండలం ధరిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు అంజాగౌడ్ గురువారం సాయంత్రం మృతి చెందాడు. చిన్నశంకరంపేట మండలం ధర్పల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు బబ్బూరి అంజా గౌడ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు అంజాగౌడ్ కాంగ్రెస్ పార్టీలో కీయాశీలకంగా పనిచేశారు. 2007, 2011 వరకు, ఎంపి టీసీ,సభ్యులుగా ప్రజలకు సేవలు అందించారు. అనంతరం తన సతీమణి 2019తో,2023 వరకు ఏంపిటీసీగా కొనసాగారు. వీరి మృతి పట్ల పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు హలావత్ మోహన్ నాయక్, తోపాటు సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాజిరెడ్డి సాన సత్యనారాయణ రమణ జిల్లా సర్పంచుల అధ్యక్షుడు ఆవులగోపాల్ రెడ్డి పలువురు సంతాపం ప్రకటించారు.గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.